# తిరుపతి - చిత్తూరు

## కాణిపాకం హుండీల ద్వారా 1.81 కోట్లు ఆదాయం



కాణిపాకం, జనవరి 20 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.81 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. సోమవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 24 రోజులకు గాను హుండీల ద్వారా 1,80,98,986 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 27 గ్రాముల బంగారు, 961 గ్రాముల గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 9,525 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 41,517 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 804 అమెరికా డాలర్లు, 780 ఆస్ట్రేలియా డాలర్లు, 5 యుఏఈ దినార్స్, 20 కెనడా డాలర్లు,10 ఇంగ్లాండ్ ఫౌండ్స్,15 యూరో కరెన్సీ ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి,ధనుంజయ,ప్రసాద్, సూపరెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి,హుండీ ఇన్స్‌పెక్టర్ సుబ్రమణ్యంనాయుడు, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## ఆ ఐపిఎస్‌లు మళ్ళీ జిల్లాకు వచ్చేశారు !

### -తిరుపతి జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు
### -ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా సుబ్బరాయుడు



తిరుపతి,జనవరి 20ప్రభాతవార్త: సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వహించడంలో వారికి వారే సాటి. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు క్రిందిస్థాయి పోలీసు అధికారులతో కలసి సమన్వయంగా పనిచేసే నేర్పు కలిగారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను ఓపికతో వినడమేగాక క్రిందిస్థాయి అధికారులతో పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. వారి సమర్ధవంతమైన బాధ్యతల నిర్వహణే మళ్ళీ తిరుపతి జిల్లాకు ఎస్పీలుగా నియమాకం కావడం ప్రత్యేకత. ఆ ఇద్దరు ఐపిఎస్ అధికారులే ఒకరు వి.హర్షవర్ధన్‌రాజు 2013 ఐపిఎస్ బ్యాచ్ అధికారి, మరొకరు తెలంగాణా కేడర్‌కు చెందిన 2013 ఐపిఎస్ బ్యాచ్ అధికారి లంకెల సుబ్బరాయుడు . ఆ ఇద్దరూ కొన్ని అనివార్యపరిస్థితుల్లో, లోటుపాట్లతో జిల్లానుండి బదిలీ అయినా తాజా ఐపిఎస్ అధికారుల బదిలీల్లో మళ్ళీ హర్షవర్ధన్‌రాజు తిరుపతి జిల్లా ఎస్పీగా, సుబ్బరాయుడు తిరుపతి ఎర్రచందనం అక్రమనివారణ టాస్క్‌ఫోర్స్ విభాగం ఎస్పీగా సోమవారం నియమితులయ్యారు. ఈ ఇద్దరు అధికారుల పనితీరు, సమర్ధవంతమైన విధులు గుర్తించిన డిజిపి ద్వారకాతిరుమలరావు మళ్ళీ తిరుపతి జిల్లాకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 27మంది ఐపిఎస్ అధికారుల బదిలీల్లో ఆ ఇద్దరు తిరుపతి జిల్లాకు రావడంతో పోలీసుశాఖలో, పోలీసు సిబ్బందిలో ఒకింత ఆనందం వ్యక్తమవుతోంది. 2024 సాధారణ ఎన్నికల సమయంలో తిరుపతి జిల్లా ఎస్పీగా వి.హర్షవర్ధన్‌రాజు ఎన్నికల కమిషన్ ఆదేశాలతో నియమితులయ్యారు. అప్పట్లో ఎన్నికలు సక్రమంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించారు. అయితే ఎన్నికలు ముగిసిన తరువాత జరిగిన ఘర్షణలు, వివాదాల కారణంగా ఆయన బదిలీ అనివార్యమైంది. ఆ తరువాత కడపజిల్లా ఎస్పీగా నియమితులయ్యారు. మళ్ళీ అక్కడ ఉండి ఆయన పోస్టింగ్ కోసం వేచివున్నారు. కాగా ఇటీవలే తిరుపతిలో ఈనెల 8వతేదీ జరిగిన టిటిడి వైకుంఠద్వార దర్శన టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోవడంతో ఎస్పీగా సుబ్బరాయుడు బదిలీ తప్పనిసరిగా మారింది. అయితే స్థానికంగా ప్రజల నుండి ఉన్న మంచిపేరుతో ప్రభుత్వం ఆయన్ను ఎర్రచందనం అక్రమరవాణా నియంత్రణ ఎస్పీగా నియమించింది. ఆ ఇద్దరు మళ్ళీ తిరుపతి జిల్లాకు రావడంతో ఒకింత ఆనందంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోనే ఇద్దరు ఐపిఎస్‌లు బాధ్యతలు చేపట్టనున్నారు.

## అంబరాన్నంటిన ఫ్లెమింగో సంబరం

### పులికాట్ తీరంలో మూడురోజులు సందడే సందడి





సూళ్లూరుపేట, జనవరి 20 ప్రభాతవార్త విజ్ఞానం, వినోదం, వీక్షణం మేళవింపుతో మూడురోజుల పాటు సూళ్లూరుపేట కేంద్రంగా నిర్వహించిన ఫ్లెమింగో సంబరం అంబరాన్నంటింది. పులికాట్, నేలపట్టులలో అరుదైన పక్షుల విన్యాసాలు, బివిపాలెంలో సందర్శకులకు హుషారు కలిగించే బోటు షికారు, శ్రీసిటీలో పులికాట్‌పై విజ్ఞానం కలిగించే అధ్యయన సదస్సులు, సూళ్లూరుపేట కాలేజి మైదానంలో వినోదం కలిగించే ఎగ్జిబిషన్ స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఫెస్టివల్ నిర్వహణకు నిండుదనం చేకూర్చాయి. నాలుగేళ్ల విరామం తర్వాత నిర్వహించిన ఈ పండుగకు అనూహ్యరీతిలో సందర్శకుల తాకిడి ఎక్కువ కావడంతో జిల్లా యంత్రాంగం ఒక్కసారిగా అప్రమత్తం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొదటిరోజున మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ప్రారంభమైన ఫ్లెమింగో ఫెస్టివల్ సంబరాలు, శనివారం రాత్రి కురిసిన వర్షంతో అసలు పండుగ జరుగుతుందా అనే సందేహం వ్యక్తమైంది. ఆదివారం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అప్రమత్తమైన మున్సిపల్ యంత్రాంగం, ఇతర అధికారగణం చొరవతో సాయంత్రంలోగా టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టి, క్వారీ డస్ట్, ఇసుకను తీసుకొచ్చి చదును చేసి కాలేజి మైదానాన్ని సిద్ధం చేశారు. మరోవైపు నేలపట్టు, అటకానితిప్ప, బివిపాలెంలలో సందర్శకుల తాకిడితో సందడిగా మారింది. సూళ్లూరుపేటలో పోలీసు యంత్రాంగం కాస్తా బందోబస్తు విషయంలో తడబడ్డారు. తిరుపతి జిల్లా ఏర్పడిన తర్వాత ప్రప్రథమంగా ఈ పండుగ చేయడం జిల్లా యంత్రాంగానికి అన్నీ కొత్తగా మారాయి. సాంస్కృతిక కార్యక్రమాలు హైలైట్ చేసేందుకు మొదటిరోజున శివారెడ్డి, రెండోరోజు సినీనటి అనసూయ, రఘు కుంచె, అశురెడ్డి, మూడోరోజున సినీనటి కృతిశెట్టి, సంయుక్త మీనన్, సింగర్ మంగ్లితో పాటు స్థానిక కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించడంతో జనరద్దీ తప్పలేదు. ఒకవైపు గేమ్స్ నిర్వహించడం, నేలపట్టు, పులికాట్ ప్రాంతాలకు ఉచిత బస్సు సౌకర్యం, విద్యార్థులకు ఉచిత భోజన సదుపాయం తదితర అంశాలో తోడు కావడంతో రద్దీ మరింత ఎక్కువయింది. ఎగ్జిబిషన్ స్టాల్స్ అంతగా ఆకట్టుకోకపోయినప్పటికీ సందర్శకులు మాత్రం వీటిని తిలకించేందుకు క్యూకట్టారు.

### అట్టహాసంగా ముగిసిన ఫ్లెమింగో సంబరాలు

సూళ్లూరుపేటలో మూడురోజులుగా నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్ సంబరాలు సోమవారంతో ముగిశాయి. ఈ వేడుకలకు రాత్రి ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరయ్యారు. ముగింపు వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ పులికాట్ విశిష్టతను చాటుతూ మూడురోజులుగా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఈ ఫెస్టివల్‌ను గత టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభించారని, తిరిగి ప్రస్తుతం నిర్వహిస్తున్నారని చెప్పారు. తిరుపతి జిల్లాలో ఉన్న నేలపట్టు, బివిపాలెం, పులికాట్‌తో పాటు ఇతర పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వాలీబాల్, టెన్నికాయిట్, కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, మాజీ ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, మాజీ మంత్రి పరసా రత్నం, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, మాధవనాయుడు, ఎజి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

### - కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన ప్రతి అర్జీని ప్రత్యేక శ్రద్ధ కేంద్రీకరించి అర్జీదారులకు సరైన పరిష్కారం చూపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు.

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 276 అర్జీలు**

కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల ప్రజల నుండి సమస్యలపై 276 అర్జీలు వచ్చాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 228 అర్జీలు వచ్చాయి. అలాగే పోలీసు శాఖ 7, డిఆర్‌డిఎ 10, పంచాయతీరాజ్ 3, పశుసంవర్ధకశాఖ 5, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 2, డిఎంహెచ్‌ఓ 2, హౌసింగ్ 3 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డిఆర్‌ఓ కె.మోహన్‌కుమార్, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి జేఈఈ (మెయిన్)-2025

### - తిరుపతి జిల్లాలో మూడు కేంద్రాలు
### - పరీక్షకు హాజరు కానున్న 1242 మంది అభ్యర్థులు
### - అన్ని ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, జనవరి 20 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలోని మూడు కేంద్రాల్లో రేపటి నుంచి జేఈఈ (మెయిన్)-2025 పరీక్షలు ఆన్‌లైన్ ద్వారా జరగనున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 22,23,24,28,29 తేదీల్లో మొదటి షిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ షిఫ్ట్ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 30వ తేది రెండవ షిఫ్ట్ 3 గంటల నుంచి 6.30 గంటలకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు ఉదయం 8గంటల 45 నిమిషాల వరకు, మధ్యాహ్నం 2 గంటల 45 నిమిషాల వరకు మాత్రమే పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని తెలిపారు. జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలో నిర్వహిస్తున్నామని, ఈ పరీక్షా కేంద్రాలకు రవాణా శాఖ వారిచే రైల్వే, బస్‌స్టేషన్‌ల నుంచి బస్సు సౌకర్యములు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాలలో అభ్యర్థులకు ఏటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, గదులు, త్రాగునీరు, లైటింగ్ తదితర వసతులు కల్పించాలని రవాణాశాఖాధికారులు, ఆరోగ్యశాఖాధికారులు, విద్యుత్ శాఖాధికారులు, పోలీస్ సిబ్బంది, సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్స్ గ్యార్మెట్స్ అనుమతి లేదని తెలిపారు.

**పరీక్షా కేంద్రాల వివరాలు :**

1. ఆయాన్ డిజిటల్ జూపార్క్, చెర్లోపల్లి, తిరుపతి -928
2. ఆయాన్ డిజిటల్ జూపార్క్, కెంఎంఎం రామిరెడ్డి గారిపల్లె చంద్రగిరి తిరుపతి-229
3. ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కాలేజ్, విద్యానగర్ కోట మండలం-85

### జాతీయత ఉట్టిపడేలా
## గణతంత్ర దినోత్సవ వేడుకలు



చిత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త: జాతీయ భావం ఉట్టిపడేలా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించడానికి పక్కాగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డిఆర్‌ఓ సమావేశభవనంలో సోమవారం డిఆర్‌ఓ మోహన్‌కుమార్ జనవరి 26న చిత్తూరు జిల్లా పోలీసు శిక్షణా మైదానంలో నిర్వహించే 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ మాట్లాడుతూ రిపబ్లిక్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. గణతంత్ర దినోత్సవ కార్యక్రమం పూర్తి సమన్వయ బాధ్యతలు చిత్తూరు అర్డీఓ, అలాగే ప్రోటోకాల్, సిట్టింగ్ ఏర్పాట్లు, ఆహ్వాన పత్రికలు ముద్రణ, పంపిణీ విధులు చిత్తూరు తహసిల్దారు, భద్రతా ఏర్పాట్లు, స్టేజీ అలంకరణ పోలీసు శాఖ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, విద్యార్థులు పాల్గొనేలా చేయాల్సిన బాధ్యత జిల్లా విద్యాశాఖ అధికారి, ఆస్తుల పంపిణీ కార్యక్రమం డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ బాధ్యతలు తీసుకోవాలన్నారు. అలాగే అత్యవసర వైద్య సేవలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, పారిశుధ్యం, నీటి సరఫరా విధులు చిత్తూరు మున్సిపల్ కమీషనర్, అగ్నిమాపక వాహనాల ఏర్పాట్లను జిల్లా ఫైర్ అధికారి చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌బాబు, డ్వామా పిడి రవికుమార్, డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, సమగ్రశిక్ష ఎసిపి వెంకటరమణ, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, హౌసింగ్ ఇన్‌ఛార్జీ పిడి గోపాల్‌నాయక్, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, కలెక్టరేట్ ఎఓ కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి కలెక్టరేట్ సోమవారం అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్
-ప్రభాతవార్త, తిరుపతి కలెక్టరేట్

## స్మార్ట్ సిటీ పనులను పరిశీలించిన కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జనవరి 20, ప్రభాతవార్త స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి నగరంలో చేస్తున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న సిటీ ఆపరేషన్ సెంటర్, మల్టి లెవల్ కార్ పార్కింగ్, శ్రీనివాస సేతులో పెండింగ్లో ఉన్న సుందరీకరణ, మురుగునీటి కాలువలు, వినాయక సాగర్ వద్ద పెండింగ్ లో ఉన్న కూరగాయల మార్కెట్, స్విమ్మింగ్ పూల్ పనులను ఇంజినీరింగ్, స్మార్ట్ సిటీ అధికారులతో కలసి సోమవారం ఉదయం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో బాగంగా నగరంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. అన్ని అభివృద్ధి పనులకు గడువు ఇవ్వడం జరిగిందని అన్నారు. కమిషనర్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ ఈ.ఈ. చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు రాజు, మధు, రమణ, లలిత, వెంకట ప్రసాద్, ఏ.సి.పి. బాలాజి, ఏఈకాం ప్రతినిధి బాలాజి, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, తదితరులు ఉన్నారు.

## వీధికి వీధికి మద్యం దుకాణాలు:సమయపాలనలేని బార్‌లు

శ్రీకాళహస్తి,జనవరి 20 ప్రభాతవార్త శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మందుబాబులకు పండగ వాతావరణం చోటు చేసుకుంది.ప్రతిపక్షంలో ఉన్నపుడు తాట తీస్తానన్న నాయకుడు అధికారంలోకి వచ్చిన తరువాత వీధికి వీధికి మందు దుకాణాలు బెల్ట్ షాపులుగా వెలిసినాయి. అయితే పాలకులు పట్టించుకోవటం లేదనే విమర్శలు చోటు చేసుకున్నాయి. అధికార పార్టీ ద్వితీయశ్రేణి నాయకులకు అనుచరులకు ఇదో ఉపాధిగా మారింది. మద్యం ధరలను క్రమబద్ధీకరించి ఎంఆర్‌పి రేట్లకు అందిస్తుండగా గ్రామ గ్రామానికి దుకాణాలు వెలసి ప్రభుత్వ ఖజానాను నింపుతున్నాయి. ఇక మామూళ్ళ మత్తులో మునిగిన సంబంధిత ఎక్సైజ్‌శాఖ బయట నుంచి వచ్చే అధికారులు ఆకస్మిక తనిఖీల గురించి బెల్ట్ షాపుల వారికి సమాచారం అందిస్తూ తమజేబులు నింపుకుంటున్నారు. ఇక అస్మదీయులకు మద్యం దుకాణాల వద్ద చిన్న చిన్న షాపులను ఏర్పాటు చేసి లబ్ది చేకూర్చారు. గతంలో బార్‌లకు సమయ పాలన ఉండేది నేడు ఆ సమయ పాలన లేదు. వేకువ జామున టీ దుకాణాల కన్నా ముందుగానే మద్యం షాపులు వెనుక దారులు తెరుచుకుంటున్నాయి.

**గ్రామాల్లో బెల్ట్ షాపులు: మామూళ్ళ మత్తులు శాఖ:**

ఏ ప్రభుత్వం అయినా అధికారంలో మనుగడ సాగించాలంటే ప్రధాన ఆదాయ రాబడి మద్యం దుకాణాల ద్వారానే అనేది జగమెరిగిన సత్యం. అధికారంలో లేనపుడు ప్రస్తుత ముఖ్యమంత్రి బెల్ట్ షాపులపై నిప్పులుచెరిగారు. అధికారంలోకి రాగానే కొత్త పాలసీలను రూపకల్పన చేసి జనం జేబులకు చిల్లులు కొడుతున్నారు.ప్రతి గ్రామానికి మద్యం షాపులు,బార్‌ల ద్వారా సరఫరా అవుతుంది.అయితే ఏ గ్రామంలో బెల్ట్‌షాపు ఉందో సంబంధిత ఎక్సైజ్ శాఖకు బాగా తెలుసు. గుట్టుచప్పుడు కాకుండా మామూళ్ళు ఖరారు చేసి మరీ వసూలు చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. సరసరి 50బాటిల్స్ అమ్మేవారు ఎక్సైజ్‌శాఖకు రూ.5వేలు నెల మామూళ్ళు సమర్పించుకోవాలి. అలాగే 100 బాటిల్స్ లోపల విక్రయించేవారు రూ.10 వేలు నెలకు ముడుపు చెల్లించాలి. ఇక అధికారులకు నెల నెలా మామూళ్ళు అందుతుండటంతో పై అధికారుల ఆకస్మిక తనిఖీలకు సంబంధించి స్థానిక ఎక్సైజ్ అధికారులు సమాచారం అందిస్తారు. షాపులు ఉదయం 10నుంచి రాత్రి 10గంటల వరకు తీసి ఉంటున్నారు. ఇక బార్‌లు ఉదయం 10 గంటలకు తెరిస్తే ఇక రాత్రి ఎప్పుడు మూస్తారో తెలియదు అన్నట్లు మారింది.

**కూల్ డ్రింక్ షాపులతో ఉపాధి:**

శ్రీకాళహస్తిలోని గ్రామాల్లో బెల్ట్ షాపులకు పక్కనే బంకులు ఏర్పాటు చేసి అస్మదీయులకు ఉపాధి కల్పిస్తున్నారు. ఇక్కడ రూ.1 విలువ చేయని రూ.5లకు విక్రయిస్తున్నారు. రూ.2ల నీళ్ళ పాకెట్లు రూ 10 లకు విక్రయిస్తున్నారు. రూ.5ల స్నాక్స్‌ను రూ.7లకు విక్రయిస్తున్నారు.దాంతో కూలి డబ్బులు తాగుడుకు దారబోస్తున్నాడని ఇళ్ళలో మహిళలు మదన పడుతున్నారు. ఈ విమర్శలకు సంబంధించి సిఐ లావణ్యను వివరణ కోరగా తమకు మామూళ్ళు అనే ఆరోపణలు అవాస్తమన్నారు. తాము ప్రతి నెల దాడులు జరిపి 15 నుంచి 20కేసులు నమోదు చేస్తున్నామన్నారు.

## టిటిడి సివిఎస్‌ఓగా మణికంఠకే అవకాశం!



తిరుమల,జనవరి 20ప్రభాతవార్తప్రతినిధి: చిత్తూరుజిల్లా ఎస్పీ విఎన్. మణికంఠచందోలు టిటిడి ఇన్‌ఛార్జి సివిఎస్‌ఓగా కూడా ఆయన కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే ఆయన ఆ బాద్యతలు అదనంగా నిర్వహిస్తున్నారు. తాజాగా 27మంది ఐపిఎస్ అధికారుల బదిలీల్లో తిరుపతి జిల్లా ఎస్పీ,ఎర్రచందనం అక్రమరవాణా నియంత్రణ టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు, సుబ్బరాయుడు నియామకమయ్యారు. ఈ భారీ బదిలీల్లో టిటిడి సివిఎస్‌ఓ నియామకం జరగలేదు. పైగా అంతమంది ఐపిఎస్ అధికారుల్లో ఎవరికీ ఆ అవకాశం కలగలేదు. దీంతో చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠచందోలు అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఇప్పటికే తిరుపతి జిల్లా ఎస్పీగా, ఎర్రచందనం అక్రమరవాణా నియంత్రణ టాస్క్‌ఫోర్స్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నా ఆ రెండు పోస్టులకు అధికారులు నియామకంతో ఆయన తిరిగి చిత్తూరుజిల్లా ఎస్పీగా పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహిస్తారు.

## గుంతలుగా మారిన గ్రామీణ రోడ్లు.. పట్టించుకోని అధికారులు



పూతలపట్టు, జనవరి 20, ప్రభాతవార్త

పూతలపట్టు మండలం గుంతల మాయంగా గ్రామీణ రోడ్ల అధ్వానంగా మారుతున్న సంబంధిత శాఖ పట్టించుకోని అధికారులు ఈ క్రమంలో తిరుపతి చిత్తూరు జాతీయ రహదారి నుండి వేపనపల్లి పంచాయతీ బూసిపల్లి గ్రామాలు 300 కుటుంబాలు ఉన్నాయి. వాహనదారులు వెళ్లాలన్న రాత్రి వేళలో అష్ట కష్టాలు వాహనదారులు తిరిగి ప్రయాణంలో చేరుతామా లేదా భయంతో వెళ్లాలి అలాగే పలు గ్రామాలు ప్రజలు ఆరోపిస్తున్నారు గుంతలుగా ఏర్పడి రోడ్డు చాలా చోట్ల రూపాన్ని కోల్పోయింది. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోవడం లేదన్నారు. ఈ రోడ్డుపై పలు గ్రామాల నలుమూల నుండి నిత్యం ద్విచక్ర వాహనాలు ఆటోలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతలు పడిన రోడ్డుమీద ప్రయాణం చేయాలన్న నరకాన్ని తలపిస్తుందని వాహనదారాలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ రోడ్డు సమస్యపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అడ్డుకట్టు వేసి గుంతలో పడిన రోడ్డుకు శాశ్వతంగా మరమ్మతులకు చేపట్టాలని పలు గ్రామాలు ప్రజలు కోరుతున్నారు.

## యదేచ్ఛగా చింత చెట్ల నరికివేత

పాకాల, జనవరి 20, ప్రభాతవార్త



పాకాల మండలంలోని పాకాల దామలచెరువు మెయిన్ రోడ్డు పైన కలప రవాణా నిత్యం జరుగుతుంది. ప్రత్యేకించి చింత చెట్లేనే నరికి వేసే లక్ష్యంగా కొంతమంది చలరేగిపోతున్నా నిద్ర మత్తులో తూగుతూ, మామూళ్ల ముసుగులో చూసి చూడనట్టు వదిలేస్తున్న ఈ అధికార యంత్రాంగం ఇలా ప్రాణ వాయువును మానవాళికి అందించే చెట్లను అక్రమంగా నరికి వేయడం వలన పర్యావరణంపై తీవ్రమైన ప్రభావం ఏర్పడుతుంది. ఇప్పటికైనా అటవీ శాఖ, రెవిన్యూ అధికారులు స్పందించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవలసినదిగా బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు కొత్తపల్లి వెంకటాద్రి నాయుడు అధికారులను కోరుతున్నారు.

## అచ్చమ్మ అగ్రహారంలో పశు వైద్య శిబిరం

పాకాల, జనవరి 20, ప్రభాతవార్త

పాకాల మండలం అచ్చమ్మ అగ్రహారం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ఆదేశాల మేరకు పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు మండల పశువైద్య సంచాలకులు డా వి.శ్రీధర్, జి. మోహన కుమారి, పశువుల వైద్యులు అచ్చమ్మ అగ్రహారం గ్రామంలో ఉన్నటువంటి పశువులకు చికిత్స చేసి, 70 ఆవులకు పైగా వాటికి పిడుదుల మందు పిచికారి చేసి, దూడలకు పశువులకు నట్టల నివారణ మందు తాగించడం, పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు ఆదియోగి రథ యాత్ర

చిత్తూరురూరల్, జనవరి 20 ప్రభాతవార్త:

చిత్తూరుపట్టణంలో ఈనెల 22వ తేది బుధవారం ఉదయం 8గంటలకు ఆదియోగి రథ యాత్ర నిర్వహిస్తున్నట్లు చిత్తూరు జిల్లా ఈషా యోగా కోఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ తెలిపారు. గంగినేని పార్కునుంచి ప్రారంభమై విశాల్‌మార్ట్, పొన్నియమ్మన్ గుడివీధి, చర్చివీధి, బజారువీధి మీదుగా వెళ్లి పిసిఆర్ స్కూల్ వరకు సాగుతుందన్నారు. ఫిబ్రవరి 26వ తేది కోయంబత్తూరులోని ఇషా మైదానంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రజలను ఆహ్వానించడంతో పాటు సందర్శించలేని వారు తమతమ ఇంటి వద్దనే ఆదియోగి దర్శనం చేసుకునేందుకు అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేమని పేర్కొన్నారు. ఈ రథ యాత్రలో శివభక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నిర్మల్‌కుమార్ కోరారు.

## ఫైనలియర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కుప్పం, జనవరి 20 ప్రభాతవార్త

పాలిటెక్నిక్ ఫైనలియర్, సెకండియర్ పరీక్షల ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ జగన్నాధరావు తెలిపారు. కంప్యూటర్స్ విభాగంలో నవనీత్889/1000, ఎలక్ట్రానిక్స్‌లో తేజస్విని 984/1000మార్కులు సాధించారన్నారు. అలాగే క్రాక్ అకాడమీ అర్హత పరీక్షల్లో వెన్నెల అనే విద్యార్థిని ఉత్తమ ఫలితాలు సాధించిందని చెప్పారు. ఫైనలియర్ కంప్యూటర్స్ విద్యార్థి ఖాజీ ఉమర్ ఏడాదికి 8లక్షల ప్యాకేజ్‌తో ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థుల్ని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

## పాడి రైతులకు ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు

కుప్పంరూరల్, జనవరి 20 ప్రభాతవార్త



పాడి పరిశ్రమపై ఆధార పడ్డ రైతులకు సిఎం చంద్రబాబునాయుడు వివిధ పథకాల ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నారని మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని వెండుగంపల్లిలో పశుసంవర్ధక శాఖచే ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. గత వైకాపా పాలనలో ఇలాంటి శిబిరాలు ఒక్కటి కూడా నిర్వహించలేదన్నారు. రైతులను ఆదుకుంటున్న సిఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు రమేష్, రామచంద్ర, పార్థసారథి, అశోక్, లోకేష్, రైతులు, వెటర్నరీ అధికారులు పాల్గొన్నారు.

**రామకుప్పం :** మండలంలోని ఆనిగానూరులో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పశువైద్యులు పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ రామూర్తి, జిల్లా అధికార ప్రతినిధి జయశంకర్, కృష్ణారెడ్డి, మహేంద్రనాయుడు, రైతులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యంత్రపరికరాలు..పనిముట్లపై రైతులకు శిక్షణ

శాంతిపురం, జనవరి 20 ప్రభాతవార్త

మండలంలోని దండికుప్పంలో మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి అధ్వర్యంలో రైతులకు యంత్ర పరికరాలు, పనిముట్ల వాడకంపై రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎఓ అప్పోజి తెలిపారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బందార్లపల్లి పంచాయతీకి రూ.25లక్షల నిధులు మంజూరు

రామకుప్పం, జనవరి 20 ప్రభాతవార్త

మండలంలోని బందార్లపల్లి పంచాయతీకి 2025-26సం॥కు గాను 25లక్షల నిధులు మంజూరైనట్లు మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. సోమవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. పంచాయతీలో వీధి దీపాలు, తాగునీరు, డ్రైన్లు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజగోపాల్, నేతలు మునిరెడ్డి, శ్రీనాథరెడ్డి, ఆనందప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యం, మురళీమోహన్ పాల్గొన్నారు.

## రహదారి భద్రతా నియమాలు పాటించాలి : సిఐ



చౌడేపల్లి, జనవరి 20 ప్రభాతవార్త

రహదారి భద్రతా నియమాలు పాటించాలని సిఐ రాంభూపాల్ అన్నారు. సోమవారం చౌడేపల్లి-పుంగనూరు ప్రధాన రహదారిలో ఆయన వాహనాలను తనిఖీ చేసారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు ధరించాలన్నారు. ఆటోవాలాలు ఓవర్‌లోడ్ వేయకుండా రికార్డులు సక్రమంగా వుంచుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆథార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి : ఎంపిడిఓ

తిరుపతిరూరల్, జనవరి20 ప్రభాతవార్త:

ఆథార్ సమస్యలు తలెత్తకుండా ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ప్రత్యేక ఆథార్ క్యాంపు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతిరూరల్ ఎంపిడిఓ కడగంటి రామచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలో ఉన్నటువంటి మహిళా పోలీసులు తమ పరిధిలో వున్న అంగన్‌వాడీ కేంద్రాలలో (0-6) గల పిల్లలకు కొత్త ఆథార్ కార్డు నమోదుకు సంబంధిత అంగన్‌వాడీ టీచర్, హెల్పర్‌లు ఆథార్ నమోదు కాని పిల్లలను గుర్తించి, రికార్డు తయారు చేయించి, ఆథార్ కార్డు నమోదు చేయించాలని సూచించారు. ఈనెల 21 నుండి 24వ తేదీల వరకు ప్రత్యేక ఆథార్ క్యాంపులలో కొత్త ఆథార్ కార్డులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్ దేవేందర్ సాయి ఆధ్వర్యంలో అవిలాల ఆంధ్ర బ్యాంకు కాలనీ, శ్రీనివాసపురం, పద్మావతిపురం, చిగురువాడ, దుర్గసముద్రం, మల్లంగుంట గ్రామ సచివాలయాలలో ఆథార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డి.ఎ యశ్వంత్ ఆధ్వర్యంలో తిరుచానూరు, యోగిమల్లవరం, చైతన్యపురం, లక్ష్మీనగర్ కాలనీ, దామినేడు, పాడిపేట, బ్రాహ్మణపట్లు, తనపల్లి, ఓటేరు, వేదాంతపురం గ్రామ సచివాలయాల్లో ఆథార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డి.ఏ. వైభవ్ సాయిరెడ్డి ఆధ్వర్యంలో చెర్లోపల్లి, వెంకటపతినగర్, పాడిపేట, పేరూరు, హరిపురం కాలనీ, విద్యానగర్, తుమ్మలగుంట, గొల్లపల్లి, సి.మల్లవరం, పెరుమాళ్ళపల్లి, ఎస్వీ నగర్ సచివాలయాల్లో ఆథార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్ వి.దివాకర్ ఆధ్వర్యంలో శెట్టిపల్లి, బిటిఆర్ కాలనీ, మంగళం-1, మంగళం-2, తుడా క్వార్టర్స్ పరిధిలో ప్రత్యేక ఆథార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## బిసిల సమస్యల పరిష్కారానికి కులగణనే కీలకం

### - జాతీయ బిసి సంక్షేమసంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జీ పి.షణ్ముగం



చిత్తూరురూరల్, జనవరి 20 ప్రభాతవార్త:

దేశ వ్యాప్తంగా బిసి కులగణన చేపట్టడంతో పాటు చట్టసభల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఫిబ్రవరి 6వ తేది బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పిలుపుమేరకు ఓబిసి రిజర్వేషన్ల సాధనకై తలపెట్టే ఛలో ఢిల్లీ కార్యక్రమంకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం జాతీయ బిసి సంక్షేమసంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జీ పి.షణ్ముగం సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థలు, చట్టసభలలో బిసిలకు సరైన రిజర్వేషన్ల కేటాయింపులు జరపాలన్నా, సమస్యలు పరిష్కరించబడాలన్నా కులగణనే కీలకమ న్నారు. సమస్యలపై ఫిబ్రవరి 6వ తేది నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమంకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని బిసి వర్గాలు ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు పూసల రవి, ఈశ్వర్, రాజా,సౌందర్యరాజు, రవీంద్రరాజు, వైహరిబాబు, రుద్రయ్య, సిరిమా వెంకటేష్, బాలాజీ, రమేష్, శివకుమార్, శంకరయ్య, కిషోర్, వెంకటేష్‌ఈశ్వర్, గణేష్‌నాయకర్, శరవణనాయకర్, మనోహర్‌యాదవ్, బాలాజీ యాదవ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## 26న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఈవెంట్

చిత్తూరు రూరల్, జనవరి 20 ప్రభాతవార్త:



నిర్వాహకులు ఎ.ఉష

ఈనెల 26న జిల్లా కేంద్రమైన చిత్తూరులో రాష్ట్రస్థాయి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఈవెంట్‌ను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవెంట్ నిర్వహకులు ఎ.ఉష తెలిపారు. సోమవారం ఆమె ప్రభాతవార్తతో మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన చిత్తూరులోని వేలూరు రోడ్డులో వున్న టీటీడీ కళ్యాణ మండపంలో రాష్ట్రస్థాయి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఈవెంట్ గెట్ గెదర్ కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా 26న ఉదయం 8 గంటలకు రిపబ్లిక్ డేను పురస్కరించుకుని జాతీయ జెండాను ఎగువేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గురుజాల జగన్‌మోహన్ ముఖ్య అతిథిగా పాలొ ్గంటారని తెలిపారు. అనంతరం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉభయ తెలుగు రాష్ట్రాలలోని యూట్యూబర్‌లు, జబర్దస్త్ కమెడియన్‌లు, శ్రీదేవి డ్రామా కంపెనీ కళాకారులు, ప్రముఖ సోషల్ మీడియా, ఇన్స్‌స్టాగ్రామ్ ప్రతినిధులతో పెద్దఎత్తున ఎంటర్‌టైన్ మెంట్, డిజె, డ్యాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పాల్గొనే ప్రతినిధులకు జ్ఞాపికలతో పాటు భోజన వసతి ఏర్పాట్లును చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే వారు ఫోన్‌పే ద్వారా 9346520447 నెంబర్‌కు ఎంట్రీ ఫీజు 500 రూపాయలు చెల్లించి పాల్గొనవచ్చునని నిర్వహకులు ఎ.ఉష తెలిపారు.

## పలమనేరులో అడిషనల్ కోర్టు ఏర్పాటు చేయండి



పలమనేరు,జనవరి 20,ప్రభాతవార్త:

పలమనేరులో అడిషనల్ కోర్టు ఏర్పాటు చేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిను పలమనేరు బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు.ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యేను కలిసి న్యాయవాదులు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ పలమనేరుకు అడిషనల్ కోర్టు కొరకు హైకోర్టు సిఫార్సు చేయగా ప్రభుత్వంలో ఆ పనులు 90శాతం పూర్తైందని తెలిపారు. పుంగనూరు, కుప్పంలో ఇప్పటికే అడిషనల్ కోర్టులు ఏర్పాటు కావడం జరిగిందని సుమారు 5500 కేసులకు పైగా ఉన్న పలమనేరులో 20 సంవత్సరాలకుపైగా పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.పెండిం గ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి అడిషనల్ కోర్టు ద్వారా త్వరితగతిన పరిష్కరించవచ్చున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీపతి,కార్యదర్శి భరకత్,నాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## 22న పలమనేరులో విద్యుత్ ఆదాలత్

పలమనేరు,జనవరి 20 ప్రభాతవార్త:

పలమనేరులో ఈనెల 22(బుధవారం) ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనునట్లు విద్యుత్ శాఖ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.పలమనేరు విద్యుత్ ఎడిఇ కార్యాలయంలో సిజిఆర్ఎఫ్ ఛైర్మన్,రిటైర్డ్ జడ్జ్ శ్రీనివాస ఆంజనేయ మూర్తి ఆధ్వర్యంలో పలమనేరు,సోదం,పుంగనూరు సబ్ డివిజన్ అధికారులతో ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు అదాలత్ కార్యక్రమం నిర్వహిచడం జరుగుతుందని,వినియోగదారులు వారి సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ఉపయోగ పడుతుందని తెలిపారు.

## ఉల్లాస్ వాలంటీర్లకు శిక్షణ పూర్తి

పుంగనూరు రూరల్, జనవరి 20, ప్రభాతవార్త

పుంగనూరులోని స్త్రీ శక్తి భవనంలో సోమవారం ఉల్లాస్‌కు చెందిన మండల స్థాయి వాలంటీర్లకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో లీలా మాధవి మాట్లాడుతూ మండలంలో 25 మందిని వాలంటీర్ టీచర్లను గ్రామస్థాయిలో నియమించినట్లు చెప్పారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. తర్వాత విద్యా సామగ్రిని వాలంటీర్లకు పంపిణీ చేశారు.

## మైనర్ బాలిక అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు



పెద్దపంజాణి, జనవరి 20 ప్రభాతవార్త

మండలంలోని చిన్నారికుంటకు చెందిన రామచంద్ర కుమార్తె నాగమణి (16) అదృశ ్యం కావడంతో ఆమె తండ్రి రామచంద్ర పెద్దపంజాణి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం సాయంత్రం నుంచి తన కుమార్తె నాగమణి కన్పించలేదని చుట్టుపక్కల గాలించినా ఫలితం లేదని తమ కుమార్తె ఆచూకీ కనిపెట్టాలని ఫిర్యాదులో కోరాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## పశు సంపదను పరిరక్షించుకోవాలి : మాదిరాజు

పందిళ్ళపల్లి(చౌడేపల్లి), జనవరి 20 ప్రభాతవార్త

పశు సంపదను పరిరక్షించుకోవాలని తేదేపా సీనియర్ నాయకుడు మాదిరాజు వెంకట్రమణరాజు అన్నారు. మండలంలోని పందిళ్ళపల్లి పంచాయతీ బాలసముద్రంలో ఆయన పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వ్యవసాయం జూదంలా మారుతున్న ప్రస్తుత సమయంలో పాడి పరిశ్రమపై రైతులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈనెల 20నుంచి 31వరకు మండల వ్యాప్తంగా శిబిరాలు ఏర్పాటు చేస్తారన్నారు. పశువులు, లేగదూడలు, మేకలు, గొర్రెలకు 2వ విడత నట్టల నివారణ మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వీటితోపాటు గర్భకోశ వ్యాధులు, చూడి నిర్ధారణా పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అనంతరం 74పశువులకు, 110గొర్రెలు, మేకలకు మందులు పంపిణీ, భూటాక్స్ స్ప్రే చేశారు. పశువైద్యాధికారి పవన్‌కుమార్, సిబ్బంది మహమ్మద్‌అలీ, గోవర్ధన్, నందకుమార్, రెడ్డిప్రసాద్, పాడి రైతులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి నివారణపై అవగాహన



బంగారుపాళ్యం, జనవరి 20 ప్రభాతవార్త:

స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం కుష్టు వ్యాధి నివారణపై ఆరోగ్య సిబ్బంది మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 20 నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఇంటింటి సర్వేను వైద్య సిబ్బంది పక్కాగా చేపట్టి పూర్తి చేయాలన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, కాళ్ళు, చేతులు తిమ్మిర్లు కలిగిన లక్షణాలు వున్న వారిని ఈ సర్వేలో గుర్తించాలన్నారు. అలాగే అంగ వైకల్య నివారణకు సంబంధిత వైద్య సిబ్బంది పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ సర్వే ఆధారంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తగు వైద్య సేవలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, డిపిఎంఓ మణి, సిహెచ్ఓ నాగమణి, ఎంపిహెచ్ఓ రమేష్‌బాబు, సూపర్‌వైజర్లు హరికృష్ణ, ఆముద, పలువురు ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## కాణిపాకంలో అభివృద్ధి పనులను పరిశీలించిన ఇంజనీరింగ్ అధికారులు



కాణిపాకం, జనవరి 20 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం అమలు జరుగుతున్న మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులను రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు సోమవారం పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా దేవస్థానంలో కోట్లాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈపనులను రాష్ట్ర దేవాదాయశాఖ చీఫ్ ఇంజనీర్ శేఖర్, స్థపతి పరమేశ్వరప్పలతో కలసి పరిశీలించారు. ఈమేరకు మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న నూతన అన్నదానం, వినాయకసదన్ రెండవ అంతస్తు తదితర పనులను వారు పరిశీలించి పనుల పురోగతి గురించి ఆలయ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా స్వామివారి పుష్కరిణి తరలింపుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచలకిషోర్, ఈఈ వెకట నారాయణ, దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయం ఈఈ గంగయ్య, భవిరి రవి, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, దేవస్థానం మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఆలయ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## బస్సు టాప్‌పై ప్రమాదకర ప్రయాణం

పుంగనూరు రూరల్, జనవరి 20 ప్రభాతవార్త



ప్రభాతవార్త పట్టణం నుంచి కుమ్మర గుంటకు వెళ్లే ఓ ప్రైవేటు బస్సులో విద్యార్థులు బస్సు టాప్ పై ప్రమాదకర స్థితిలో సోమవారం కూర్చొని ప్రయాణించారు. బస్సు రద్దీగా ఉండడంతో విద్యార్థులు బస్సు టాప్ పై ఎక్కి ప్రయాణం చేశారు. విద్యార్థులు టాప్ పై ప్రయాణిస్తున్న బస్సు డ్రైవరు కండక్టర్ అభ్యంతరం వ్యక్తం చేయలేదు. దీంతో విద్యార్థులు బస్సు టాప్ పై కూర్చుని ప్రయాణించారు. ఘటన సోమవారం సాయంత్రం ఐదు గంటలకు వెలుగులు వచ్చింది.

## జిల్లా కలెక్టర్‌ను కలసిన పిరమలై కల్లర్ రాష్ట్ర సంఘం నేతలు



కుప్పం, జనవరి 20 ప్రభాతవార్త

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ సూచనల మేరకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను సోమవారం రాష్ట్ర పిరమలై కల్లర్ సంఘం అధ్యక్షుడు ఈశ్వర్ తేవర్, ఎంబిసి రాష్ట్ర అధ్యక్షుడు పూసల రవి, తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి శివతేవర్ తదితరులు కలిశారు. తమ కులస్తులకు గత కొన్నేళ్లుగా కుల ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో ఇటీవల సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లామన్నారు. సిఎం కార్యదర్శి ప్రద్యుమ్నను కుల సర్టిఫికెట్లు మంజూరయ్యేలా చూడాలని ఆదేశించారన్నారు.23 జిల్లాల్లో తమ కులస్తులు ఉన్నారని ఈ విషయం కమీషన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్ కుమార్ బిసి కమీషన్‌తో చర్చించి త్వరలోనే కులధృవీకరణ పత్రాలను మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రైల్వే ప్రయాణీకులకు కాసింత ఊరట

కుప్పం, జనవరి 20 ప్రభాతవార్త

కుప్పం రైల్వేస్టేషన్‌లో మూడో ప్లాట్‌ఫామ్ ఏర్పాటు, యార్డ్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో కుప్పం మీదుగా వెళ్లే రైళ్లకు స్టాపింగ్‌లను రద్దు చేస్తూ ఇటీవల రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. అయితే ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తే నేపథ్యంలో రైల్వే ప్రయాణీకులకు ఉన్నతాధికారుల కొంత ఊరట కలిగించారు. కుప్పం - బెంగళూరు మధ్య తిరిగే పుష్‌పుల్ రైలును పూర్తిగా రద్దు చేసినట్లు తొలుత ప్రకటించినా అనంతరం ఈ రైళ్లను కొనసాగించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2,3,7,8 తేదీల్లో మాత్రం ఉదయం 6.45గంటలకు ఈ రైలును రద్దు చేశారు. అలాగే జోలార్‌పేట ఎక్స్‌ప్రెస్ రైలు కూడా యధావిధిగా తిరుగుతుందని ఫిబ్రవరి 8,9తేదీల్లో మాత్రం రద్దు చేశారు. కాగా ఈనెల 23వతేది నుంచి రెండో ప్లాట్‌ఫామ్ మీదుగా బెంగళూరు వైపు వెళ్లే రైళ్లకు కుప్పంలో స్టాపింగ్‌లు రద్దు చేశారు.

## నగరి డిఎస్పీగా సయ్యద్ మొహమ్మద్ అజీజ్



చిత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త:

నగరి సబ్ డివిజన్ పోలీసు అధికారిగా సయ్యద్ మొహమ్మద్ అజీజ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం 2022 బ్యాచ్ డిఎస్పీలకు పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో నగరి డిఎస్పీగా నియమితులైన సయ్యద్ మొహమ్మద్ అజీజ్ నగరి డిఎస్పీ కార్యాలయంలో డిఎస్పీగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

## సమస్యలను సత్వరం పరిశీలించి పరిష్కారం

### - మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశం



చిత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త:

చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో సత్వరం పరిశీలించి పరిష్కరించాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రజలు ఆరు సమస్యలపై మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వచ్చిన పలు సమస్యలను అక్కడికక్కడే మున్సిపల్ అధికారులతో చర్చించి కమీషనర్ పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగంకు సంబంధించి 3, రెవెన్యూ, మెప్మా, ప్రధాన కార్యాలయంకు సంబంధించి ఒకొక్క సమస్య మున్సిపల్ కమీషనర్‌కు ప్రజలు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇ వెంకటరామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎసిపి నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారంపై దృష్టి

### - ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుకు సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు వినతి



చిత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త:

ఢిల్లీ కేంద్రంగా సాగుతున్న రైతు ఉద్యమం పట్ల ఉదాశీనత తగదని సత్వరం పరిష్కార మార్గం చూపడానికి ఎంపీలు ప్రత్యేక శ్రద్ద వహించాలని రైతు సంఘాల సమన్వయ సమాఖ్య పేర్కొంది. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపు మేరకు ఎంపీలకు రైతు సమస్యలపై అర్జీలు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా సోమవారం రైతు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జనార్ధన్, కె.మునిరత్నంలు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు వ్యక్తిగత కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ సుదీర్ఘ ఉద్యమం నేపథ్యంలో రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడం దారుణమన్నారు. రైతు నాయకుడు దల్లేవాల ప్రాణాలను కాపాడాలని, నూతన మార్కెటింగ్ చట్టాలను సత్వరం రద్దు చేయాలని, పెంచిన విద్యుత్ బిల్లులను ఉపసంహరించాలని, మ్యాంగో బోర్డు ఏర్పాటుకు సత్వరం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఏనుగుల బెడద నుండి రైతుల ప్రాణాలను కాపాడి పంటను రక్షించాలని కోరారు. రైతు ఉద్యమానికి సంఘీభావంగా ఈ నెల 26వ తేదీన రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లో స్కూటర్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రైతు సంఘాల నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ఉమాపతి, కార్మిక సంఘ నాయకులు నాగరాజు, మణి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## దేహధారుడ్యానికి క్రీడలు అవసరం

పెనుమూరు, జనవరి 20 ప్రభాతవార్త:

దేహ ధారుడ్యానికి, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని, యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని ఎంపిపి హేమలత సురేష్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పులిగుండు వద్ద మహాసముద్రం దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ఎంపిపి హేమలత సురేంద్రరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం యువత ఉద్యోగాలు చేసుకుంటూ పని ఒత్తిడితో సతమతమవుతున్నారని, వీరు క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. ఈ టోర్నమెంటులో విజేతలుగా నిలిచిన పులిగుండు యూత్ టీమ్‌కు రూ.35 వేలు, రన్నర్స్‌గా నిలిచిన గుంటిపల్లి, కన్నికాపురం యూత్‌కు రూ.17,500లను ఆమె అందజేశారు. అలాగే ఈ టోర్నమెంటులో మ్యాన్‌ఆఫ్‌ది సీరిస్ భాను, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కిరణ్, ఉత్తమ బౌలర్‌గా జ్యోతి, ఉత్తమ బ్యాట్‌మెన్‌గా గుణశేఖర్‌లకు ప్రత్యేక బహుమతులను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో మహాసముద్రం సురేష్‌రెడ్డి, నాయకులు షణ్ముగరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరి

బంగారుపాళ్యం, జనవరి 20 ప్రభాతవార్త:



ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని తహసిల్దారు రాజేంద్రప్రసాద్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్స వంలో భాగంగా సోమవారం బంగారు పాళ్యంలో పోలీసు, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు రహదారిపై ద్విచక్రవాహనాలు నడుపుతూ ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ ధరించి అవగాహన కల్పించారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం వాహనదారులు హెల్మెట్ లేని కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని తహసిల్దారు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడుపాలని సూచించారు. అతివేగం ప్రాణాలకు ముప్పు అని గుర్తించి వాహనాలను జాగ్రత్తగా నడుపాలని ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## అందాల పోటీల్లో గెలుపొందడం ఆనందంగా ఉంది

- విలేకరుల సమావేశంలో భావనరెడ్డి చిన్నతంబు




తిరుపతి హెల్త్, జనవరి 20 ప్రభాతవార్త : మిస్ గ్లోబల్ ఏసియా–2025 అందాల పోటీలో తాను గెలుపొందడం ఎంతో సంతోషంగా ఉందని చంద్రగిరికి చెందిన భావన రెడ్డి చిన్నతంబు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జనవరి 9న మలేషియాలో జరిగిన ఈ అందాల పోటీల్లో 40 దేశాలకు చెందిన యువతులు పాల్గొనడం జరిగిందన్నారు. ఈ పోటీలకు ఇండియా తరపున తాను పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. తిరుపతి జిల్లా చంద్రగిరి పాతపేట బాలాజీ నగర్‌లో ప్రముఖ రియల్టర్ సి.గోపీకృష్ణ, లక్ష్మి దంపతుల కుమార్తెగా యావత్ భారత్ జాతికి, ప్రపంచానికి తన కీర్తిని తెలియజేయడంతో పాటు మువ్వెన్నల జెండాను మలేషియాలో ఎగుర వేయడం జరిగిందని తెలిపారు. 2023లో మొదటి సారిగా ఒక చాలెంజ్‌గా మిస్ ఇండియా ఐకాన్ దివా విజేతగా కిరీటాన్ని కైవసం చేసుకోవడం జరిగిందని గుర్తు చేశారు. తాను స్థాపించిన మిత్ర ఫౌండేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి సేవలందిస్తున్నానన్నారు. దీని కోసం సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను త్వరలో కలుస్తానని చెప్పారు. ఎవరైనా చిన్న నాటి నుంచి ఒక గోల్‌ను పెట్టుకుని ఆ దిశగా అడుగు వేస్తే వారి గమ్య స్థానాన్ని సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో భావనరెడ్డి కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

## ఆర్వోప్లాంట్‌ను పరిశీలించిన ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈ

తొట్టంబేడు, జనవరి 20 ప్రభాతవార్త : మండలంలోని కొన్నలి గ్రామంలో గత కొద్ది నెలలుగా ఆర్వో వాటర్ ప్లాంట్, సోలార్, శిథిలావస్థకు చేరుకుంది. గ్రామస్తులకు తాగునీరు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని గ్రామస్తులు మండల ఎంపిపి ఉన్నం నిర్మల వాసుదేవనాయుడు తెలిపారు. దీంతో స్పందించిన ఎంపిడిఓ ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈ గౌరిజోష్‌ను కొన్నలి గ్రామానికి వెళ్ళి పరిశీలించాల్సిందిగా ఆదేశించారు. దీంతో సోమవారం ఆమె కొన్నలి గ్రామానికి చేరుకునిశిథిలావస్థకు చేరుకున్న ఆర్వో వాటర్ ప్లాంట్ పరిశీలించి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భార్గవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ కాలనీ ప్రజల కోరిక తీర్చిన ఎమ్మెల్యే



నగరి, జనవరి 20 ప్రభాతవార్త : నగరి మునిసిపాలిటీ పరిధిలోని నెత్తంకండ్రిగ ఎస్టీ కాలనీ ప్రజల చిరకాల కోరికను ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ నెరవేర్చారు. స్థానిక ఎస్టీ కాలనీ ప్రజలు చాలా కాలంగా మంచినీటి సమస్యను ఎదుర్కొం టున్నారు. పలుమార్లు తమ సమస్యను పరిష్కరించాలని గత ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం కనిపించలేదు. దీంతో స్థానికులు ఎండా కాలం తీవ్ర మంచినీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో గత ఎన్నికలపుడు ఎస్టీ కాలనీని సందర్శి ంచిన భానుప్రకాశ్ వద్ద ప్రజలు సమస్యను ప్రస్తావించగా తప్పక బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.4.50 లక్షలతో బోరు వేయించి దానికి విద్యుత్ మోటారు బిగించి మంచినీటి సరఫరా ప్రారంభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జాబ్ మేళాలో 31 మందికి ఉద్యోగాలు

పుత్తూరు, జనవరి 20 ప్రభాతవార్త : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 31 మందికి ఉద్యోగాలు లభించాయి. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడప్, డిఆర్‌డిఎ ఉమ్మడిగా జాబ్ మేళా నిర్వహించాయి. టెక్ మహీంద్ర, డిక్సన్, అపోలో ఫార్మశీ వంటి కంపెనీలు ప్రతినిధులు 94 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించగా అందులో 31 మంది ఉద్యోగాలు పొందారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపల్స్ వీరయ్య, జి.కోటేశ్వరయ్య, కాలేజీ ఎస్‌పిజిసి టి.నరసింహులు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య, స్కిల్ హబ్ సమన్వయకర్త ఎస్.రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## పత్యేకాభిషేకాల్లో అంజూరు



శ్రీకాళహస్తి,జనవరి 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో నూతనంగా నిర్మించిన మండపాలు, ఆలయాల కుంబాభిషేకాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం హరహరేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేకాభిషేకాల్లో మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వారి సహచరులు పాల్గొన్నారు. పురాతనమైన పనస కోనలో పురాణ ప్రసిద్ది చెందిన ఆలయం శిధిలావస్థకుచేరుకోగా రూ.40లక్షలతో జీర్ణోద్ధారణ గావించామన్నారు. నేడు ఈ ఆలయం పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో అందుబాటులో ఉంటుందన్నారు. ఆయనతో పాటు ఆయనతో పాటు గుమ్మడి బాలకృష్ణయ్య, శ్రీవారి సురేష్,కుమార్, ధన,ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## ఒక వైపు డివైడర్ తొలగింపు...రోడ్డు వెడల్పుకు చర్యలు

శ్రీకాళహస్తి,జనవరి 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని పానగల్‌లో బ్యూటిఫికేషన్ పనులకు శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాలతో మున్సిపల్ పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో పానగల్‌లోని స్వర్ణముఖి నది ఒడ్డు పంచాయతీరాజ్ అతిథి గృహం నుంచి ఎపి సీడ్స్ కూడలి వద్ద ఉన్న దేవస్థానం ఆర్చి వరకు సుందరీకరణ పనులకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం వేకువ జామున రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లలో ఒక వైపు డివైడర్‌ను తొలగించారు. ఈ అంశానికి సంబంధించి కమిషనర్ బిఎస్‌గిరికుమార్ మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాల యానికి ప్రతి నిత్యం వేలాది మంది అతిధులు,భక్తులు దూరప్రాంతాల నుంచి వస్తుంటారు. అయితే పట్టణం అందంగా కనబడాలని శాసనసభ్యులు, ఓ వైపు దేవస్థానం నిధులతో అభివృద్ది కార్యక్రమాలతో పాటు మున్సిపల్ అధికారులకు కూడా పలు అంశాలను వివరించారని తెలిపారు. ఇక్కడ లైటింగ్ కూడా బాగా లేదని దానిని మార్చమని ఎంఎల్ఏ ఆదేశించారన్నారు. మహాశివరాత్రి లోపల పూర్తి చేయుటకు ఎంఎల్ఏ లక్ష్యంగా వివరించారన్నారు.

## వినాయక స్వామి మహాకుంబాభిషేకం



శ్రీకాళహస్తి,జనవరి 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కుమారస్వామి కొండ దిగువ భాగాన వినాయక మండపం ఉండేది. అయితే అది శిధిలావస్థకు చేరుకోవటంతో జీర్ణోద్ధారణ గావించారు. సుమారు రూ.40లక్షలతో జీర్ణోద్ధారణ గావించిన మండపంలో వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా హోమాలు,కలశ స్థాపన గావించిన వారు. సోమవారం ఉదయం స్థానిక ఆచారాలమేరకు మహాకుంబాభిషేకం జరిపించారు. ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి ఆదేశాలతో ఇక్కడ ప్రత్యేకంగా ఆచార్యులను నియమించి కుంబాభిషేకం జరిపించారు. ఈ కార్యక్రమాలను ఎఇఓ లోకేష్‌రెడ్డి పర్యవేక్షణలో, ఎఇఓ హేమామాలిని, డిఇఇ శ్రీనివాసులు రెడ్డి,ఎఇఇ వేణుగోపాల్ రెడ్డి సూపరింటెం డెంట్ రవి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య పాల్గొనగా ఆలయ ప్రధానార్చ కులు కరుణగురుకుల్ సంబంధం గురుకుల్, దక్షిణామూర్తి, గోవిందశర్మ,ఎస్‌ఎంకె పరశురాం గురుకుల్ (అచ్చిత) తెలుగుదేశం నాయకులు వాకచర్ల గుర్రప్పశెట్టి మాజీకోఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మెన్ డివి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ళు లేని వాళ్లు దరఖాస్తు చేసుకోండి: సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి,జనవరి 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఇళ్ళు, భూముల్లేని నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి పిలుపు నిచ్చారు.నిరుపేదలు పార్టీ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ మనోజ్ వద్ద అందించాలని పిలుపు నిచ్చారు.శ్రీకాళహస్తి నియోజక వర్గంలో గతంలో నిరుపేదల పేరుతో కొందరు పట్టాల వ్యాపారం సాగించి అన్యాయం చేసారన్నారు.శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్,ఊరందూరు సమీపంలోని కాలనీల్లో భారీ ఎత్తున పట్టాల కుంభకోణం జరిగిందని శాసనసభ్యుడు వివరిస్తూ నియోజకవర్గంలోని నాయకులు ప్రతి చోట ఇళ్ల లేని వారి జాబితాలను అందిస్తూ కంప్యూటర్‌లో పొందుపరచాలని ఎంఎల్ఏ పిలుపు నిచ్చారు.

## అధికార భాషా కమిటీ కన్వీనర్‌తో వీసీ సమావేశం



తిరుపతి విద్య,జనవరి 20 ప్రభాతవార్త : పార్లమెంటరీ అధికార భాషా కమిటీ కన్వీనర్ డాక్టర్ దినేష్ శర్మతో జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి సోమవారం వర్సిటీలో సమావేశమ య్యారు. ప్రభుత్వ శాఖలలో హిందీ వాడకాన్ని ప్రోత్సహించడం, అధికారిక భాషగా హిందీని ప్రోత్సహించే వ్యూహాలపై చర్చించారు.వర్సిటీ ఇకనుంచి హిందీ భాషాభివృద్ధిపై దృష్టి సారించాలని కన్వీనర్ వీసీకి సూచించారు.

## విద్యార్థిల భవిష్యత్తుకు కెరీర్ గైడెన్స్ అవసరం



తిరుపతి విద్య,జనవరి 20 ప్రభాత వార్త : విద్యార్థుల భవిష్యత్తుకు కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్స్ ఎంతో ఉపకరిస్తాయని మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ పేర్కొన్నారు. సోమవారం పద్మావతి మహిళా వర్సిటీలో విద్యార్థులకు మార్గ దర్శకాన్ని అందించడానికి ఏర్పాటు చేసిన విజయ సోపాన యాత్ర కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పైడి అంకయ్య,రిజిస్ట్రార్ రజిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాగంపల్లి భూముల రీ సర్వేకు శ్రీకారం



శ్రీకాళహస్తిరూరల్,జనవరి 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి తీవ్ర ఆరోపణలు విమర్శలు చోటు చేసుకున్న తరుణంలో శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి భూముల రీ సర్వేకు సంచలన నిర్ణయం తీసుకున్నారు.ఈ నేపథ్యంలో ప్రయోగా త్మకంగా సోమవారం నాగంపల్లి గ్రామంలో సర్వే చేపట్టారు. ఆయన రీ సర్వేను ప్రారంభిస్తూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత ఐదేళ్ళ పాలనలో నిరుపేదలకు సంబంధించిన భూములను ఓ పార్టీ తమ సొంత సామ్రాజ్యంగా భావించి విచ్చల విడిగా ఆక్రమించుకున్నారు. కొన్ని వేల ఎకరాల భూములు ప్రభుత్వానికి చెందినవి అన్యాక్రాంతం జరిగాయని తమకు సమాచారం వుందన్నారు. నిరుపేదలకు న్యాయంచేయటమే లక్ష్యంగా రీసర్వే చేపట్టామన్నారు.ఈ సర్వేలో తహశీల్దార్ భార్గవి,నాయకులు ఏర్పేడు మండలానికి చెందిన పేరం ధనంజయనాయుడు, పొన్నారావు, శివశంకర్‌రెడ్డి, అశ్వత్థామ, సర్పంచ్ మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగ వైకల్య నివారణకు సహకరించండి

విజయపురం, జనవరి 20 ప్రభాతవార్త: అంగవైకల్య నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని వైద్యాధికారి గుణశేఖర్ తెలిపారు. సోమవారం మండలకేంద్రమైన విజయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధి నివారణపై ఆశ కార్యకర్తలకు, ఏఎన్ఎంలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 2 వరకు నిర్వహించే కుష్టు వ్యాధి గుర్తించు కార్యక్రమంలో ప్రతిఒక్కరికి పరీక్షలు నిర్వహించాలని కోరారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్ కార్యాలయ ఎదుట ఏఐటీయూసీ ధర్నా



తిరుపతి కలెక్టరేట్, జనవరి 20 ప్రభాతవార్త : రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆయా జిల్లాల కలెక్టర్ కార్యాలయ ఎదుట ధర్నా నిర్వహించారు. తిరుపతి జిల్లా కార్యాలయం ఎదుట సోమవారం జరిగిన ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాధాకృష్ణ, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డి రవి, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మహేంద్ర, జిల్లా అధ్యక్షులు నరసింహులు హాజరై మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ పడుతున్న బాధలను తెలియజేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రుయా ఆస్పత్రిలో వెల్నెస్ సెంటర్ ప్రారంభం



తిరుపతి హెల్త్, జనవరి 20 ప్రభాతవార్త : రుయా ఆస్పత్రిలో సోమవారం నూతనంగా వెల్నెస్ సెంటర్‌ను ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ చంద్రశేఖరన్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్నెస్ సెంటర్ అనేది ఆరోగ్యం, వెల్నెస్‌కు సమగ్ర విధానాన్ని అందించేచే సౌకర్యం అని, ఇది నివారణ విద్య,సమగ్ర సంరక్షణపై దృష్టి సారిస్తుందన్నారు. అనంతరం రుయా ఆస్పత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ రవి ప్రభు వెల్నెస్ సెంటర్ సంపూర్ణ, సమగ్ర ప్రయోజనాలను గురించి వివరించారు.

## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య!

చంద్రగిరి, జనవరి 20 ప్రభాతవార్త: ఓ వ్యక్తి రైలు క్రిందపడి ఆత్మహత్యకు పాల్పడిన దుర్ఘటన శ్రీనివాస మంగాపురం, శ్రీవారిమెట్టు మార్గానికి సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకున్నట్లు ఆర్‌పిఎస్‌ఐ (చిత్తూరు) ఎ.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సుమారు 25-30 మధ్య వయస్సు కలిగిన గుర్తు తెలియని పురుషుడు తిరుపతి-చంద్రగిరి మధ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడనీ, అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడు గుండు చేయించుకుని వున్నాడు. మీకు తెలిసిన వ్యక్తులు ఎవరైన కనబడలేదని తెలిస్తే ఆర్‌పిఎస్‌ఐ మొబైల్ నంబర్ 9494228854 కు కాల్ చేయాలని కోరారు.

## వారపు సంతకు మంచి రోజులు వచాయి

**-సంత అభివృద్ధిపై దృష్టి సారించిన ఎమ్మెల్యే**



రేణిగుంట జనవరి 20 ప్రభాతవార్త : ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చొరవతో రేణిగుంట వారపు సంతకు మంచి రోజులు వచ్చాయని సంతను ఆశ్రయించి జీవనోపాధి సాగిస్తున్న చిరువ్యాపారు ఆనందోత్సాహాలు వ్యక్తపరిచారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సోమవారం రేణిగుంట వారపు సంతను, ఆర్టీసి బస్టాండ్ వద్ద మరుగుదొడ్లను ఆకస్మికంగా సందర్శించారు. సంత లోపల, సంత బయట, ఆర్టీసి బస్టాండ్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సంతలో సౌకర్యాలపై అక్కడి వ్యాపారులతో చర్చించారు. సంత దుస్థితిపై అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సంతను బాగుపరచాల్సిందిగా అధికారులను ఆదేశించారు. సంతలోపల సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని, సిమెంటు బెడ్లు నిర్మించాలని, తాత్కాలిక షెడ్లు నిర్మాణం పూర్తి కావాలని, మరుగుదొడ్ల పనులు వేగవంతం చేయాలని, నీటి వసతి కోసం బోరువేయాలని,విద్యుత్ సరఫరా నిరంతరం ఉండాలని అధికారులను ఆదేశించారు. పనులు మరో రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆపై తాను ప్రారంభోత్సవం చేస్తానని తెలిపారు. సంతలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని టిడిపి నేతలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సంతలో మఫ్టీలో పోలీసులను ఉంచాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే తో పాటు ఎంపీడీవో విష్ణు చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి మణి, అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి,తిరుపతి పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రమణ్యంరెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, టిడిపి సీనియర్ నేత డి.పుష్ప నాదం, టిడిపి మండల మాజీ ఎస్సీ కన్వీనర్ నెల్లూరు సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ జ్యోతినారాయణ, నవాబు, కన్నన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## విద్యతోపాటు నైపుణ్యాలను పెంచుకోవాలి : రైల్వే సీఐ



రేణిగుంట, జనవరి 20 ప్రభాతవార్త : ప్రతి విద్యార్థి విద్యతో పాటు నైపుణ్యాలను పెంచుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తిరుపతి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ మధుసూదన్ అన్నారు. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో సోమవారం విజయ సోపాన యాత్ర కెరియర్ మార్గదర్శక కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి తిరుపతి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ మధుసూదన్, ఉపకులపతి ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రాజిని, జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు, అంకయ్య వే ఫౌండేషన్ సభ్యులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విజయ సోపాన యాత్ర ముఖ్యాంశాలుగా వ్యక్తిగత కెరీర్ కౌన్సిలింగ్ సెక్షన్లు, ఉపాధి నైపుణ్యాలు యంత్రాంగం మార్గదర్శనం, ప్రైవేటు ప్రభుత్వ ఉద్యోగ వనరువ్యాప్తి, నైపుణ్యాధారిక విద్యా ప్రేరణ స్వయం ప్రమాణత, తదితర అంశాలను వక్తలు వివరించారు. విద్యను అభ్యసించాలని అందులోని అర్థాలను గ్రహించాలని విద్య గొప్పతనాన్ని మెదడులో నిక్షిప్తం చేయాలని తద్వారా విజ్ఞానవంతులుగా ఎదుగుతామన్నారు.

## కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ



రేణిగుంట జనవరి 20 ప్రభాతవార్త: రేణిగుంట మండలం విప్పమాను పట్టెడ పంచాయతీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, డిఎల్ ఎటిఓ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి ఆదేశాల మేరకు రేణిగుంట మండల ప్రాథమిక వైద్యాధికారి చత్ర ప్రకాష్ సూచనలతో హెల్త్ సూపర్వైజర్ కామరాజు సోమవారం కుష్టు వ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరికి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. శరీరంపై మచ్చలను పరిశీలించి స్పర్శలేని మచ్చలపై అనేక విషయాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి, ఏఎన్ఎం రెడ్డమ్మ, ఎం.ఎల్.హెచ్.పి యమునా, హెచ్.వి అనురాధ, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు సావిత్రి, మోహినిలు పాల్గొన్నారు.

## క్రికెట్ ఆడడం వలన ఆరోగ్యం




తిరుపతి విద్య,జనవరి 20 ప్రభాతవార్త: భాష్యం ప్రీమియర్ మ్యాచ్ 2024 2025 జోనల్ ఇంచార్జ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో కే.వి.యస్. గ్రౌండ్ తుమ్మల గుంట నందు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష విచ్చేసి తిరుపతి టైటాన్, నరసరావుపేట నినాజిస్ మ్యాచ్ ప్రారంభించారు. క్రీడాకారులును ఉద్దేశించి మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ క్రికెట్ ఆడడం వలన ఆరోగ్యపరంగా ఎంతో మేలు జరుగుతుంద న్నారు. భాష్యం స్కూల్స్ యాజమాన్యంకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ ఆవిష్కరణ

తిరుపతి విద్య, జనవరి 20 ప్రభాతవార్త: సమకాలీన హిప్‌హాప్ బీట్స్‌తో బాలీవుడ్‌లో ప్రసిద్ధి చెందిన శ్రావ్యమైన గీతాలను మిశ్రమం చేసిన మూడో ఎడిషన్ కోసం సీగ్రామ్ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మళ్లీ వచ్చింది. సంక్రాంతిని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో గ్లోబల్ బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ కార్తీక్ మహేంద్ర మాట్లాడుతూ మ్యూజిక్ విశ్వజనీయ భాషకు చిరునామా గా, యువతకు మ్యూజిక్ ను తమ కీలకమైన అభిరుచి మూలస్థంభంగా సంబరం చేసుకునేలా దీని రూపొందించామన్నారు. సీఈఓ అజయ్ గుప్త మాట్లాడుతూ రాయల్ స్టాగ్ నేటి యువత కోసం మ్యూజిక్కు ఒక కీలకమైన అభిరుచి అంశంగా ఎల్లప్పుడూ భావించింది. అందుకే ఇలాంటి వాటిని ముందుకు తీసుకొస్తున్నా మన్నారు. మ్యూజిక్ డైరెక్టర్,సింగర్ అమిత్ త్రివేది,యతీష్ మెహ రిషి,పాటల రచయిత ఆర్మన్ మాలిక్, గాయని నిఖిత గాంధీ, కళాకారుడు రఫ్తార్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ మొదటి సెమిస్టరు ఫలితాలు విడుదల

తిరుపతి విద్య, జనవరి 20 ప్రభాతవార్త: ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాల ఆటానమస్ లో మొదటిసారిగా డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను కంట్రోలర్ డా.ఎన్ జగదీష్ కుమార్ విడుదల చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డా. బి.సత్యనారాయణ తెలిపారు.తి.తి.దే.ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న ఎస్ జి ఎస్ఆర్ట్స్ కళాశాల మొదటి ప్రయత్నంలోనే నాక్ ఎ+ గ్రేడును సాధించి తద్వారా ఆటానామస్ హోదాను 2024-25 సంవత్సరం నుండి అమలులోనికి తీసుకొని రావడం జరిగింది. అలాగే ఆటానామస్ హోదాలో మొదటి సెమిస్టర్ విద్యార్థులకు చక్కని ప్రణాళికతో జంబ్లింగ్ విధానంలో పరీక్షలను డిసెంబర్ 23 నుండి 31 వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కంట్రోలర్స్ డా.ఎం.మాదన్న,పి ఉదయ,పరీక్షల విభాగంలో మెంబర్లైన డా.పి.శివకుమార్, డా.కె.కోటేశ్వరయ్య, డా.కె.వెంకటేష్, పి.హరీష్‌రెడ్డి వారి బృందాన్ని కళాశాల ప్రిన్సిపాల్,వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వర అభినందించారు.

## ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

తిరుపతి విద్య,జనవరి 20 ప్రభాతవార్త: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో డిసెంబర్లో జరిగిన డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలు సోమవారం విడుదల చేశారు. అటానమస్ హోదా పొందిన మూడు డిగ్రీ కళాశాలలో తొలి సారి పరీక్షలు నిర్వహించి కేవలం 20 రోజులలోనే తొలి ఫలితాలు విడుదల చేయడం గమనార్హం. శ్రీ పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షకు 1088 మంది విద్యార్థులు హాజరుకాగా 878 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ టి నారాయ ణమ్మ తెలిపారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విద్యులత,డాక్టర్ భద్రమణితో పాటు అధ్యాపకులు,సిబ్బంది కృషి అభినందనీయమన్నారు.

## ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో సెమిస్టర్ ఫలితాలు విడుదల

తిరుపతి విద్య జనవరి 20 ప్రభాతవార్త: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో డిసెంబర్లో జరిగిన డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలు సోమవారం విడుదల చేశారు. అటానమస్ హోదా పొందిన డిగ్రీ తొలి సారి పరీక్షలు నిర్వహించి కేవలం 20 రోజులలోనే తొలి ఫలితాలు విడుదల చేయడం గమనార్హం. అటానమస్ హోదాలో తొలిసారి ఫలితాలు విడుదల చేయడంపై కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో డెప్యూటీ కంట్రోలర్స్ డాక్టర్ కె.కామేశ్వరరావు, కెప్టెన్ వి.రమేష్, సి.ఇ.సెల్ సభ్యులు చక్రవర్తి, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ శేషాద్రి, డాక్టర్ నాగరాజు, వివిధ విభాగాల హెచ్. ఓ.డీ లు మరియు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించండి

కేవీబీ పురం, జనవరి 20 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 20 నుంచి ఫిబ్రవరి 2తేదీ వరకు జరిగే సర్వే సక్రమంగా నిర్వహించాలని వైద్యాధికారి కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టి సక్రమంగా సర్వే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీల వర్గీకరణపై ఫిర్యాదులు తెలియజేయవచ్చు

కేవీబీపురం, జనవరి 20 ప్రభాతవార్త: ఎస్సీల వర్గీకరణపై దళిత నాయకులు, దళితులు అభ్యంతరాలు, ఫిర్యాదులు తెలియజేయవచ్చునని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఆనందరావు, కృష్ణలు కేవీబీపురంలో ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో నేడు మంగళ వారం ఎస్సీల కమిటీ బృందం వస్తుందని, ఎస్సీల వర్గీకరణపై ఫిర్యాదులు, అభ్యంతరాలు తెలియజేయవచ్చునని ఆయన పేర్కొన్నారు.

## ఏఐఎఫ్ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

సత్యవేడు, జనవరి 20 ప్రభాతవార్త: సత్యవేడులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అఖిలభారత యువజన సమైక్య జిల్లా రెండవ మహాసభల విజయవంతం చేయాలని కరపత్రాలను విడుదల చేశారు. ఏఐవైఎఫ్ తిరుపతి జిల్లా జాయింట్ సెక్రటరీ టి.నాగార్జున మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని శ్రీసిటీ పరిశ్రమల్లో రిజర్వేషన్లు పాటించాలని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, వయో పరిమితి పెంచాలని ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు ఈ జిల్లా మహాసభల్లో చాలా ముఖ్యమైనవని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ సత్యవేడు నియోజకవర్గ కోశాధికారి బి.ప్రతాప్, శంకర్, డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రహ్మాలింగేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేకం



నింద్ర,జనవరి 20 ప్రభాతవార్త : మండలంలోని ఎలకాటూరు గ్రామంలో వెలసిన పురాతన శ్రీకామాక్షి సమేత బ్రహ్మాలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా కుంబాభిషేకం ప్రారంభమైంది. శ్రీకామాక్షి సమేత బ్రహ్మాలింగేశ్వరస్వామి కుంబాభిషేకం ప్రారంభం సందర్భంగా వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ మహాకుంబాభిషేకం వైభవంగా జరిగింది. కుంభాభిషేకంకు ముఖ్యఅధిదిగా ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు పూజ్యశ్రీ ప్రతాప్ స్వామిజీ హాజరైనారు.ఆయన మాట్లాడుతూ శ్రీకామాక్షి సమేత బ్రహ్మాలింగేశ్వరస్వామి దేవాలయం చాలా మహిమ కలిగిందని వాటితో పాటు ప్రాముఖ్య కలిగిన అని ఈదేవాలయం దర్శించుకుంటే వారు కోరిన కోరికలు నేరవేరుతుంది అన్నారు.

## సిఎం సహాయనిధి నిరుపేదలకు వరం : బొజ్జల బృందమ్మ



తొట్టంబేడు, జనవరి 20 ప్రభాతవార్త : సిఎం సహాయనిధి నిరుపేదలకు వరమని ఎంఎల్ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ తెలిపారు. పట్టణ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు జి.విజయ కుమార్‌నాయుడు ఆధ్వర్యంలో సిఎం సహాయనిధి చెక్కులను పంపిణీచేశారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేవలం ప్రకటనలకే పరిమితమైందని, ఆస్పత్రుల్లో సరిగ్గా వైద్యసేవలు అందలేదని,ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా ఆపరేషన్‌లు చేసుకున్న ఆస్పత్రులకు సరిగ్గా నగదు అందించలేదని పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీకార్డులు కూడా పనిచేయలేదన్నారు. కాగా శ్రీకాళహస్తి పట్టణం, ఏర్పేడు మండలం, శ్రీకాళహస్తిరూరల్, తొట్టంబేడు మండలానికి చెందిన రేణిగుంట మండలాలకు చెందిన అర్హులైన వారికి సుమారు రూ.11లక్షలు చెక్కులను అందించారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంతారమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్యనాయుడు, వన్నెకుల రాష్ట్ర నాయకుడు మిన్నల్‌రవి, మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు గుర్రప్పశెట్టి, గోపీనాథ్, సుమతి, సుప్రజ, మల్లీశ్వరమ్మ, కుమార్, రమేష్, రామచంద్రయ్య, బషీర్, ఉమేష్‌రావు, నివేదిత మోరే, కుమారి, శాంతమ్మ, సరోజనమ్మ, జిలానీ బాష, ఖాదర్‌బాషా, బుజ్జి, ఆర్ముగం కిట్టు, వెంకటరామానాయుడు, సుబ్రమణ్యం నాయుడు, పోలూరు శ్రీనివాసులురెడ్డి, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## షూ కొలతల్లో తప్పులుంటే సవరించండి



తొట్టంబేడు, జనవరి 20 ప్రభాతవార్త : విద్యార్థుల షూ కొలతల నమోదులో తప్పులుంటే సంబందిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంటనే సవరించుకోవాలని సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజింగ్ అధికారి సురేష్ అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్‌బి మున్సిపల్ ఉన్నత పాఠశాల, జయరామారావువీధిలోని రంగయ్య నాయుడు పాఠశాల, కుమారస్వామి తిప్ప, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్‌తో కలసి సోమవారం పరిశీలించారు. తప్పుడు ఉంటే యాప్‌లో వెంటనే సవరించుకోవాలని సూచించారు.

## పల్లె నుంచి డిల్లీ వరకు....

**-ఊరందూరు విద్యార్థిని అభినందించిన ఎంఎల్ఏ**



శ్రీకాళహస్తి, జనవరి 20 ప్రభాతవార్త : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శ్రీకర్ అనే విద్యార్థి ఇటీవల డిల్లీలో జరిగిన పరీక్షా పే చర్చా కార్యక్రమం నందు పాల్గొన్న సందర్భంగా ఎంఎల్ఏ వెంకట సుధీర్‌రెడ్డి విద్యార్థిని అభినందించారు. విద్యార్థికి గైడ్ టీచర్లుగా వ్యవహరించిన గణితశాస్త్ర ఉపాధ్యాయులు శ్రీనివాసులు కూడా విద్యార్థిని ప్రోత్సహించి గైడ్ చేసిందుకు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యురాలు రాజకుమారి, ఉపాధ్యాయులు సురేష్, రమేష్‌బాబు, మురళీ, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పశు వైద్య శిబిరాల ద్వారా వైద్య సేవలు



వాకాడు, జనవరి 20 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలో పశు వైద్య శిబిరాలు ప్రారంభమైనాయి. వైద్య శిబిరాలను వాకాడు పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రమణయ్య ప్రారంభించారు. మండల పరిధిలోని చిన్న తోట, ఎర్రగాటిపల్లి, చిట్టమూరు మండల పరిధిలోని గునపాటి పాలెం గ్రామాల్లో జరిగిన వైద్య శిబిరాలను వాకాడు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ రమణయ్య పర్యవేక్షిస్తూ, పశువులకు శాస్త్ర చికిత్సలు, పాడి రైతులకు, రైతులకు మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో పశువైద్యులు డాక్టర్ సిహెచ్ కృష్ణారావు, శ్రీలక్ష్మి, డాక్టర్ వి శ్రీహరిలు వైద్య సేవలు అందించారు.

## మున్సిపల్ కార్మికుల ధర్నా




వెంకటగిరి, జనవరి 20 ప్రభాతవార్త : డిమాండ్ల సాధనకు మున్సిపల్ కార్యాలయం వద్ద 16 రోజుల నుండి కార్మికులు ధర్నా చేస్తున్నారు. ఆఫ్కాస్ సిబ్బందికి, డైలీ వేజెస్ కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, జీతాలు చెల్లించమని అడిగితే కార్మికుల్ని బూతులు మాట్లాడిన ఇన్చార్జి కమిషనర్ కార్మికులకు క్షమాపణ చెప్పాలని కోరారు. జీవో నెంబర్ 36 ప్రకారం చెత్త వాహనాల డ్రైవర్లకు జీతం 24,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. కరోనా సమయం నుండి పనిచేస్తున్నటువంటి డైలీ వేజెస్ కార్మికుల్ని ఆఫ్కాస్ లోకి చేర్చాలని తెలిపారు. పిఎఫ్ పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. పిఎఫ్ రికార్డుల్లో కావాలనే ఉద్దేశ పూర్వకంగా కార్మికుల ఇంటిపేర్లు మరియు పేర్లు తప్పులు తడకలుగా చేసి కార్మికుల్ని కార్యాలయాల చుట్టూ తిరిగేటట్లు చేస్తున్న సిబ్బందిపై చర్యలు చేపట్టాలన్నారు.

## ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలి



వెంకటగిరి, జనవరి 20 ప్రభాతవార్త : పట్టణంలో ఇల్లు లేని పేదలు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. మున్సిపాలిటీ సుదర్శన్ నగర్ సచివాలయ 8పరిధిలో ప్రజల సమస్యల మీద గ్రీవెన్స్ జరగడం జరిగింది. ఇందులో భాగంగా ప్రభుత్వం వారు ఇల్లు లేని నిరుపేదలకు 2 సెంట్లు స్థలమును పట్టణంలో ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేదలు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి 8వ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## రీసర్వే ఫైలెట్ ప్రాజెక్టుకు తాళ్లపల్లి ఎంపిక

బాలాయపల్లి, జనవరి 20 ప్రభాతవార్త :రీసర్వే ఫైలెట్ ప్రాజెక్టుకు మండలంలోని తాళ్లపల్లి గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గ్రామంలో మంగళవారం నుండి రీసర్వే చేసేందుకు మూడు టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూమి, రైతుల సాగు చేసుకుంటున్నా భూములను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సర్వేయర్లు ఉమామహేశ్వరి, వెంకన్న బాబు మండల సర్వేయర్ తారక రామారావు, వీఆర్వో శ్రీనివాసులు రెడ్డిని టీముగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## నేటి నుండి ఆధార్ క్యాంపులు :ఎంపీడీవో

బాలాయపల్లి, జనవరి 20 ప్రభాతవార్త : మండలంలోని వెంగమాంబ పురం గ్రామంలో 21వ తేదీ, బాలాయపల్లిలో 22వ తేదీ, నిండలిలో 23వ తేదీ సచివాలయాల్లో ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. 0 నుండి 6 సంవత్సరాలు వయసు కలిగిన చిన్నారులు అంగన్వాడి కేంద్రాలకు వెళుతున్న వారి కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో 250 మంది చిన్నారులు ఉన్నారని వీరందరికీ ఆధార్ కార్డులు ఇస్తామని తెలిపారు.

## గూడూరు నూతన డిఎస్పీగా పి.గీత



గూడూరు, జనవరి 20 ప్రభాతవార్త : నూతన డిఎస్పీగా పి.గీత సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ గూడూరు, వెంకటగిరి నియోజకవర్గంలో లా అండ్ ఆర్డర్ విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూస్తామన్నారు. అదే విధంగా గుడూరు పట్టణంలో ట్రాఫిక్‌కు చర్యలు చేపడతామన్నారు. ప్రజలకి ఎక్కడ కూడా శాంతిభద్రత విషయంలో ప్రజలందరూ పోలీసు వారికి సహకరించాల్సిందిగా తెలియజేశారు. డిఎస్పీగా బాధ్యతలు చేపట్టకముందు విశాఖ పట్టణంలో గ్రూప్‌వన్ పరీక్షలు సెలక్షన్ కావడం జరిగిందనివారు తెలిపారు. గతంలో ఎక్సైజ్ ఎస్పై, సీఐగాను తహశీల్దార్‌గాను, దంత వైద్యులు గాను పనిచేయడం జరిగిందని తెలిపారు. అనంతరం డివిజన్‌లోని సీఐలు,ఎస్ఐలు ఘనంగా సన్మానించారు. ఇక్కడ పని చేస్తున్న గూడూరు డిఎస్పి డి.వి.రమణ కుమార్ గుంటూరు బదిలీ అయ్యారు.

## శ్రీసిటీ స్టాల్‌లో సందర్శకుల సందడి



తడ, జనవరి 20 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్‌లో సందర్శకుల జోరు పెరిగింది. ఫ్లెమింగో ఫెస్టివల్‌లో భాగంగా శ్రీసిటీ వారు స్టాల్ ఏర్పాటు చేశారు. ఫ్లెమింగో ఫెస్టివల్ సోమవారం చివరిరోజు కావడంతో ఈ స్టాల్‌కు సందర్శకుల సందడి మరింతగా పెరిగింది. పెద్దఎత్తున ప్రజలు, విద్యార్థులు స్టాల్‌ను సందర్శించారు. పరిశ్రమలు, వాటి ఉత్పత్తుల ఫోటోలు, వీడియో ప్రదర్శనలు వీటిని విశేషంగా ఆకట్టుకున్నాయి.

# గూడూరు డివిజన్

## క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన తీపనూరు టీమ్



చిల్లకూరు, జనవరి 20 ప్రభాతవార్త: తీపనూరు గ్రామంలో జరుగుతున్న ఒడూరు, తీపనూరు యూత్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లలో గెలుపొందిన ఒడూరు తీపనూరు టీమ్ మొదటి బహుమతి, ఎన్ఆర్ పల్లి టీమ్‌కు రెండవ బహుమతులు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ అందించారు. యువతకు క్రీడలు ఎంతో ముఖ్యమని, యువత రాజకీయలలో కూడా ముందుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, తెలుగు యువత పాల్గొన్నారు.

## భూ కబ్జాలపై విచారణ వేగవంతం చేయాలి



కోట, జనవరి 20 ప్రభాతవార్త: కోట మండలం కేశవరం పంచాయతీలో గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు వైసీపీ నాయకులు భూకబ్జాలకు పాల్పడ్డారని మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు చాపల శ్రీనివాసులు ఆరోపించారు. సోమవారం కేశవరం గ్రామంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. కేశవరం గ్రామంలోని స్మశాన భూమి, రాఘవాపురంలో భూ ఆక్రమణలకు పాల్పడ్డారని చెప్పారు. ఆ మేరకు ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారన్నారు. అధికారులకు భూ కబ్జాలకు పాల్పడిన వారిపై విచారణను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఆక్రమణదారుల నుంచి భూములు స్వాధీనం చేసుకొని భూమిలేని పేదలకు ఆ భూములు పంపిణీ చేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గం టీడీపీ కార్యదర్శి కోటేశ్వర ప్రసాద్, కసుమూరు వెంకటేశ్వర్లు, జలసంఘం అధ్యక్షుడు బాబు, నాగూరయ్య, పసుపులేటి వేణు, భూపతి, గజేంద్ర, మల్లి తదితరులు పాల్గొన్నారు.

## పశు పోషకులకు ప్రభుత్వం భరోసా



కోట, జనవరి 20 ప్రభాతవార్త : వ్యవసాయం తర్వాత ఎక్కువమంది పాడి పరిశ్రమతో జీవనోపాధి పొందుతున్నారని మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ అన్నారు. సోమవారం కోట మండలం తూర్పుకండ్రిగ, గూడలి గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలకమైన పాడి పోషణను ప్రోత్సహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ప్రధానంగా పశువులు, దూడలు, మేకలు, గొర్రెలకు నట్టల మందు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామన్నారు. గొర్రెలకు, మేకలకు బొబ్బ వ్యాధి నివారణ టీకాలు వేస్తామని తెలిపారు. పాడి పోషకులకు శాస్త్రీయ పశు యాజమాన్య పద్ధతులపై వివరించారు. గోకులం షెడ్ల ప్రాధాన్యం, వాటిలో ప్రయోజనాలు, ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, ఉపాధి నిధులు, పశుగ్రాసం సాగు, పశు బీమా పథకాలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు.

## ఎన్‌బికెఆర్ అధ్యాపకునికి డాక్టరేట్



కోట, జనవరి 20 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ములుముడి రాజేష్‌కు శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంచే డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఎఐ ఎనేబుల్డ్ పవర్ క్వాలిటీ ఎన్విరాన్‌మెంట్ ఇన్ రెన్యువబుల్ ఇంటిగ్రేటెడ్ స్టాండెలోన్ సిస్టమ్స్ అనే అంశంపై శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాల యంలో ప్రొఫెసర్ డాక్టర్ ఎ.లక్ష్మీదేవి పర్యవేక్షణలో ఆయన పరిశోధన చేశారు. కృత్రిమ మేధస్సు ఆల్గారిథమ్‌లు సౌర ఉత్పత్తిని గాలి శక్తిపెంచడానికి, ఇంటిగ్రేటెడ్ స్టాండ్ అలోన్ సిస్టంలో విద్యుత్ నాణ్యత మరియు గ్రిడ్ నిర్వహణను మెరుగుపరచడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం ట్రిపుల్ ఈ విభాగాధిపతి సురేష్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు రాజేష్‌ను అభినందించారు.

## గణతంత్ర వేడుకలకు ఎన్‌సిసి క్యాడెట్లు



కోట, జనవరి 20 ప్రభాతవార్త : ఈ నెల 26న విజయవాడలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఎన్‌సిసి విద్యార్థులు గాయత్రి, ఎన్.హరికృష్ణ ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న విజయవాడలో జరిగే గణతంత్ర వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో విద్యార్థుల కవాతులో తమ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నావెల్ ఎన్‌సిసి అధికారి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం పదవికి లోకేష్ అన్ని విధాలా అర్హుడు



సూళ్లూరుపేట, జనవరి 20 ప్రభాతవార్త : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పదవికి మంత్రి నారా లోకేష్ అన్నివిధాలుగా అర్హుడని తెలుగుదేశం తిరుపతి పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ లోకేష్ తెలుగుదేశం పార్టీని విజయపథంలో నడిపేందుకు అహర్నిశలు శ్రమించారని అన్నారు. యువగళం పేరుతో సుదీర్ఘదూరం పాదయాత్ర నిర్వహించి ప్రజల కష్టనష్టాలు తెలుసుకొని మంచి నేతగా రాటుదేలాడని అన్నారు. ఈ నేపథ్యంలో పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలని కోరడం, అందుకు తనవంతుగా మద్దతు పలుకుతున్నట్లు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు మంచి నిర్ణయం తీసుకొని లోకేష్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇస్తే అటు పార్టీ, ఇటు ప్రభుత్వం ప్రజల్లో మంచి పేరు తెచ్చుకుంటుందని సతీష్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## నాయుడుపేటలో ఆనంకు ఘనస్వాగతం

నాయుడుపేట జనవరి 20 ప్రభాతవార్త : రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం నెల్లూరు నుండి సూళ్ళూరుపేటలో జరిగే ప్లేమింగో పెస్టివల్‌కు రోడ్డుమార్గంలో వెళుతున్న తరుణంలో నాయుడుపేట మల్లాంజ క్లన్ వద్ద మాజీ ఏఎంసి చేర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు తెదేపా నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈకార్యక్రమ ంలో ఆయన వెంట నెలవల రాజేష్,786రఫి,జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్,వేలూరు మురళికృష్ణరెడ్డి,మాజీ జడ్పిటిసి పేరంశెట్టి శ్రీరామ్‌ప్రసాద్, తెదేపా మండల అధ్యక్షుడు సన్నారెడ్డి చంద్రారెడ్డి, సుబ్బారావులు ఉన్నారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సూళ్లూరుపేట, జనవరి 20 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్ భాగంగా సత్య మాస్టర్స్ ఈవెంట్స్ వారి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సినిమా పాటలకు నృత్యాలు, సాంప్రదాయ నృత్యాలతో పాటు పాట కచ్చేరిలు నిర్వహించారు. సినీ హీరోయిన్లు కృతిశెట్టి, సంయుక్త మీనన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యాంకర్ రవి కార్యక్రమాన్ని ఆద్యంతం రక్తికట్టేలా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయని మంగ్లీ తన పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు.

## పాడి పరిశ్రమాభివృద్ధికి రైతు సహకరించాలి

శ్రీకాళహస్తిరూరల్,జనవరి 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పాడిపరిశ్రమ గృహ పరిశ్రమగా అభివృద్ధి చెందుతుందని మహిళలకు ఉపాధిగా ఉందని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఏర్పేడు మండలం బండారుపల్లి గ్రామంలో పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఎంఎల్ఏ ముఖ్యఅతిదిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.ఎంఎల్ఏ మాట్లాడుతూ రైతుల ఉపయోగార్థం ప్రభుత్వాలు మినీ గోకులం పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మండలంలో మంజూరు చేసిన మినీ గోకులాల నిర్మాణాలను పనులు చేసుకున్న వారు శ్రద్దగా చేయకపోవటం శోచనీయమని ఎంఎల్ఏ అసంతృప్తి వ్యక్తం చేసారు. శిబిరంలో 195 పశువులు 66దూడలు,88గొర్రెలు వైద్యపరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారిగురువారెడ్డి మండలాధ్యక్షుడు పొన్నారావు, సీనియర్ నాయకులు ధనంజయులు నాయుడు శివశంకర్‌రెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, కృష్ణవేణి, నాగేశ్వరరావు, రమణ, మునెయ్య, సుబ్రమణ్యం డాక్టర్ సునీత,ఎడి శిల్పారెడ్డి,పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

విజయపురం, జనవరి 20 ప్రభాతవార్త: ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి శివకుమార్ తెలిపారు. ఉచిత పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ జపమేరీ ప్రసన్నకుమార్ సోమవారం ప్రారంభించారు. వైద్య శిబిరం జనవరి 31 వరకు ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్నామని, ప్రతి పాడి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులో వసూల్ రాజాలు



పాలసముద్రం, జనవరి 20 ప్రభాతవార్త: పెనుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాల సముద్రం మండలం బలిజకండ్రిగలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో వసూల్ రాజాలు రాజ్యమేలుతున్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి ఎద్దైనా వస్తువులను సీనరేజస్ చెల్లించకుండా అక్రమంగా ఎవరైనా తరలిస్తుంటే అలాంటి వాటిని పట్టుకుని జరిమానా విధించాల్సిన మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు సిబ్బంది బలిజకండ్రిగ గ్రామంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ యార్డు చెక్‌పోస్టులో ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. బలిజకండ్రిగ తమిళనాడు రాష్ట్రానికి సరిహద్దుగా వుండటంతో పాలసముద్రం మండలం నుండి వ్యవసాయ ఉత్పత్తులు ఎలాంటి సీనరేజస్ ఫీజు చెల్లించకుండా అక్రమంగా తరలి వెళ్తున్నాయని భావించిన పెనుమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు బలిజకండ్రిగలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టు సిబ్బంది పోలీసులు, రవాణా శాఖ అధికారుల తరహాలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండటంతో వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ చెక్‌పోస్టుకు అమడ దూరం లోనే పోలీస్ స్టేషన్ వున్నప్పటికీ పోలీసు సిబ్బంది సైతం ఈ చెక్‌పోస్టు సిబ్బం దిని అదుపు చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుండి ఈ మార్గంలో వస్తున్న బస్సుల నుండి చెక్‌పోస్టు సిబ్బంది పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉన్నత అధికారులు ఈ చెక్‌పోస్టు పనితీరుపై దృష్టి సారించి వాహనదారుల ఇబ్బందిని తొలగించాల్సిన బాధ్యత ఎంతైనా వుంది.

## కాణిపాకం ఆలయానికి 4 లక్షలు విరాళం



కాణిపాకం, జనవరి 20 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంకు ఓ భక్తుడు సోమవారం వివిధ పథకాలకు 4 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తెలంగాణా రాష్ట్రం వరంగల్‌కు చెందిన హనుమంతరావు అనే భక్తుడు దేవస్థానంలో అమలు జరుగుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి 3,00,116 రూపాయలు, సిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి చెక్ రూపంలో ఆలయ ఏఈఓ రవీంద్ర బాబుకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రూ.10లక్షలతో వాకింగ్ ట్రాక్ ముస్తాబులు:



శ్రీకాళహస్తి,జనవరి 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని వాకింగ్ చేసే ప్రజల సౌకర్యార్థం రూ.10లక్షలతో మొదటి విడతగా వాకింగ్ ట్రాక్‌ను శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆదేశాలతో చేపట్టామన్నారు. ఈ ట్రాక్‌కు గతంలో మంత్రి హోదాలో బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ఈ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసి మధ్యలో చక్కటి పార్కు బోట్ క్లబ్, చిల్డ్రన్స్ పార్కును ఏర్పాటు చేయుటకు నిధులు కూడా అమృతపథకంలో మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో రూ.75లక్షలు మంజూరు చేసారు. కానీ అప్పటి కమిషనర్ ఈ నిధులు చాలని నిధులు మురిగిపోకుండా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆధునీకరణ పనులు చేపట్టారు. అయితే శాసనసభ్యుడుగా సుధీర్‌రెడ్డి గెలిచిన తరువాత వాకింగ్ ట్రాక్‌ను నిర్మాణానికి రూపకల్పన చేసారు. ఈ ట్రాక్‌కు సంబంధించి కమిషనర్ బి.యస్ గిరికుమార్ మాట్లాడుతూ నిధుల అవకాశాన్ని బట్టి నీటి కుంట చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అలాగే ఇక్కడ చిల్డ్రన్స్ పార్కు బోట్ క్లబ్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

## ప్రజల నుంచి 53 ఫిర్యాదులు

**-జిల్లా ఎస్పి మణికంత చందోలు**



తిరుపతి కార్పొరేషన్, జనవరి 20 ప్రభాతవార్త : ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నాడు జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేసి స్టేషన్‌కు వెళ్లి కూడా సరైన పరిష్కారం జరగని ఫిర్యాదుదారులకు భరోసా కల్పించి వారికి తగిన న్యాయం చేసి తక్షణమే పరిష్కరించాలననే ముఖ్య ఉద్దేశంతో ఈరోజు ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో జూమ్ ముఖాముఖి కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి బాధితులు నేరుగా సంబంధపడిన స్టేషన్ అధికారులతో మాట్లాడే విధంగా ఏర్పాటు చేశారు. తద్వారా అధికారులను కేసు వివరాలను అడిగి తెలుసుకొని బాధితుల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఎస్పీ కార్యాలయానికి వచ్చిన వారి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ఎంతో ప్రయాసపడి న్యాయం జరుగుతుంది అనే ఆశతో తీరని కష్టం ఉంటేనే ప్రజలు ఎస్పీ కార్యాలయానికి వస్తారని, ఈ ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. స్టేషన్‌కి వెళ్లి పరిస్కరం కలగలేదని, మరలా ఎస్పీ కార్యాలయానికి ఫిర్యాదుదారులు వస్తే అధికారుల బాధ్యతారహితంగా భావించి చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రావిమనోహర ఆచారి శాంతి భద్రతలు పాల్గొన్నారు.

## చైల్డ్ ట్రాన్స్‌ఫోర్ట్ వెహికల్‌ను ప్రారంభించిన కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, జనవరి 20 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ఎంఆర్‌బీఎస్‌కే చైల్డ్ ట్రాన్స్ ఫోర్ట్ వెహికల్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ వాహనం ద్వారా పిల్లల ఆరోగ్య సమస్యలను సమయానికి గుర్తించి అవసరమైన వైద్య సేవలను అందించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ హరిత, ఆర్‌బీఎస్‌కె ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ పద్మావతి, వైద్యాధికారి డాక్టర్ అంహిగ్నా, డీఈఐసీ మేనేజర్ డాక్టర్ గుణశేఖర్, డీఈఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

## వినతులు త్వరితగతిన పరిష్కరించండి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జనవరి 20 ప్రభాతవార్త : వినతులు సమస్యలు త్వరి తగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 10 మంది, మరో 40 మంది వినతులు ద్వారా సమస్యలను విన్నవించారని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, డిఈలు, సూపరింటెండెంట్లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.25కోట్లతో వాహనాల మండపం ప్రారంభం



శ్రీకాళహస్తి,జనవరి 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో ఏళ్ళ తరబడి నిర్మించిన వాహనాల మండపంను సోమవారం కుంబాభిషేకంతో ప్రారంభించారు. రాజగోపురం కూలినపుడు పునర్నిర్మాణానికి టెండర్లు పిలిచారు. సుమారు పది సంవత్సరాల పాటు ఇక్కడ నిర్మాణం జరిగింది. ఇక్కడ రాతి కట్టడాన్ని రూ.1.25కోట్లతో పూర్తి చేసారు. ఆలయ అర్చకులు,వేదపండితుల సారధ్యంలో కుంబాభిషేకం జరిపారు. సోమవారం ఉదయం మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన కలశాలను ఉద్వాసన జరిపి ఆ నీటితో కుంబాభిషేకం జరిపారు. పునీతమైన నీటితో వినాయకుడు, చండీకేశ్వరుని విగ్రహాలకు అభిషేకించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, శ్రీనివాస గురుకుల్, అచ్చితా గురుకుల్ (ఎస్ఎంకె పరశురామ్ గురుకుల్) పౌరోహితులు అర్ధగిరి స్వామి అధికారులు ఇఇ మురళీధర్‌రెడ్డి, ఎఇఒ లోకేష్‌రెడ్డి, స్థపతి కుమార్,తెలుగుదేశం పార్టీకి చెందిన వాకచర్ల గుర్రప్పశెట్టి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరాది భక్తులకు శ్రీవారి దర్శనం



తిరుమల,జనవరి 20ప్రభాతవార్తప్రతినిధి: ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా సందర్భంగా అక్కడ శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటుచేసి, భక్తులకు స్వామివారి దర్శనంతోబాటు సేవలు వీక్షించే భాగ్యం కల్పించడం ఆనందంగా ఉందని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. ఇప్పటికే ప్రయాగ్ రాజ్‌లో మహాకుంభమేళాలో భక్తులు స్వామివారిని దర్శించుకునేలా 250మంది టిటిడి సిబ్బంది సేవలందించడం బావుందన్నారు. సోమవారం ఉదయం ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు నమూనా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ఏర్పాట్లపై సంతోషం వ్యక్తం చేశారు.



**ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన విజయ్ భరత్‌రెడ్డి**

## ద్రవిడ వర్సిటీలో రేపటి నుంచి నాక్ బృందం పర్యటన



కుప్పం, జనవరి 20 ప్రభాతవార్త : ఏడుమంది సభ్యులతో కూడిన నేషనల్ అక్రిడిటేషన్ కమిటీ (నాక్) బృందం ఈనెల 22-24తేదీల్లో ద్రవిడ వర్సిటీలో పర్యటించనుంది. మూడు రోజుల పాటు వర్సిటీలోని ప్రతి విభాగాన్ని పరిశీలించాక ఈ బృందం వర్సిటీ గ్రేడింగ్‌కు నివేదిక అందించనుంది. ఇటీవలే ద్రవిడ వర్సిటీలో సిఎం చంద్రబాబునాయుడు ఆధునాతన క్లాస్‌రూమ్ కాంప్లెక్స్ భవనాలు, వసతి గృహాలను ప్రారంభించారు. కాగా ఈసారి వర్సిటీకి నాక్ నుంచి మంచి గ్రేడ్ వస్తుందని వర్సిటీ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## 2.50లక్షల విలువ చేసే వాహనాలు స్వాధీనం



వి.కోట, జనవరి 20 ప్రభాతవార్త : వి.కోట పట్టణంలో గత కొంతకాలంగా ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరు నిందితుల్ని అరెస్ట్ చేసినట్లు సిఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన చోరీల వివరాలు వెల్లడించారు. టువీలర్ల చోరీపై ఇటీవల ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఎస్పీ మణికంత చందోలు, డిఎస్పీ ప్రభాకర్ ఆదేశాల మేరకు రెండు బృందాలుగా విడిపోయి నిఘాఉంచామన్నారు. సోమవారం కుప్పం-పలమనేరు జాతీయ రహదారి అన్నవరం క్రాస్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా పడిగలకుప్పంకు చెందిన విశ్వనాథరెడ్డి (31) టువీలర్‌లో రాగా అతన్ని రికార్డుల గురించి ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదన్నారు. దీంతో అతన్ని విచారించగా తాను, బైరుపల్లికి చెందిన నాగరాజు (34)లు టు వీలర్ల చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడన్నారు. నిందితులనుంచి 2.50లక్షల విలువ చేసే నాలుగు టువీలర్లు స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితుల్ని అరెస్ట్ చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సై బాబు, ఎఎస్సై మురళీమోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.